www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 138 | శుక్రవారం 03.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

# ఇకపై టీచర్లకూ మధ్యాహ్న భోజనం..

## 'వీబీజీ రామ్‌జీ'పై సుప్రీంకోర్టుకు వెళ్లాలనే యోచన!

### ఇక విద్యార్థులతో పాటే ఉచిత భోజనం

- రేవంత్ రెడ్డి అధ్యక్షతన తొలి కేబినెట్ భేటీ
- ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బందికీ ఉచిత భోజనం
- టీచర్లు, నాన్-టీచింగ్ సిబ్బందికి మధ్యాహ్న భోజన పథకం
- ప్రభుత్వ పాఠశాలల్లో కీలక నిర్ణయం
- విద్యా రంగంలో చారిత్రాత్మక నిర్ణయం
- పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు ప్రభుత్వ చర్యలు
- టీచర్లకు భోజన సౌకర్యంతో హాజరు మెరుగుదల లక్ష్యం
- విద్యా సంఘాల నుంచి ప్రభుత్వ నిర్ణయానికి హర్షం
- కేంద్ర 'వీజీ రివ్యూ' పథకంపై కేబినెట్ చర్చ
- పథకంపై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సులకు ఆమోదం
- విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబాటు

03



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ భేటీ వాడీవేడిగా కొనసాగుతోంది. సమావేశంలో భాగంగా తొలుత కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'వీబీజీ రామ్‌జీ' పథకంపై విస్తృతంగా చర్చించినట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు పథకంపై కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని సమాచారం. 'వీబీజీ రామ్‌జీ'పై తెలంగాణ ప్రభుత్వం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును ఆశ్రయించాలని మంత్రివర్గం డిసైడ్ అయినట్లుగా తెలుస్తోంది.

**ఉపాధ్యాయుల హాజరు మెరుగుదలపై ప్రభుత్వం ఫోకస్**

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**
సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరుగుతున్న తెలంగాణ తొలి 'ఈ-కేబినెట్' భేటీలో విద్యా రంగానికి సంబంధించి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు పనిచేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బంది అందరికీ ఉచితంగా అల్పాహారం , మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రివర్గం నిర్ణయించింది.అయితే, ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకం, కొన్నిచోట్ల సీఎం అల్పాహార పథకం అమలు అవుతోంది. అయితే, ఇకపై పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో విద్యార్థులతో పాటు రోజంతా విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, నాన్-టీచింగ్ స్టాఫ్, ఇతర సిబ్బందికి కూడా ఈ ఉచిత భోజన సదుపాయాన్ని విస్తరించాలని కేబినెట్ తీర్మానించింది. తాగాజ నిర్ణయంతో విద్యాసంస్థల్లో నాణ్యమైన సమయం గడపడానికి, టీచర్లు సకాలంలో అందుబాటులో ఉండటానికి మరింత వీలు కలుగుతుందని సర్కార్ భావిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ సంఘాలు, విద్యా రంగ సిబ్బంది, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఒకేసారి సమాధానం ఇస్తా..

## రాజీనామాకు ఇంకా సిద్ధంగానే ఉన్నా

### బీఆర్ఎస్ పాలనపై శ్వేతపత్రం విడుదల



నా లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తా

బావ-బామ్మర్ది ఇద్దరూ గన్‌పార్క్‌కు రండి..

గన్‌పార్క్ ఘట్టంతో మరింత ముదిరిన కాంగ్రెస్-బీఆర్ఎస్ పోరు

- గన్‌పార్క్ వేదికగా కాంగ్రెస్-బీఆర్ఎస్ రాజకీయ సవాళ్లు
- రాష్ట్ర అప్పులపై ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం
- హరీశ్‌రావుకు కౌంటర్‌గా మంత్రి పొంగులేటి సవాల్
- 'ఇద్దరం కలిసి చర్చిద్దాం'.. గన్‌పార్క్‌కు రమ్మన్న మంత్రి
- తెలంగాణ భవన్ నుంచి గన్‌పార్క్‌కు హరీశ్‌రావు ర్యాలీకి అడ్డుకట్ట
- హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతల అరెస్ట్‌తో ఉద్రిక్తత
- గన్‌పార్క్, తెలంగాణ భవన్ వద్ద భారీ పోలీసు బందోబస్తు
- రూ.8.21 లక్షల కోట్ల ఆర్థిక భారం మిగిలిందన్న మంత్రి పొంగులేటి

02

# చాలెంజ్ ఎందుకు చేశారు

## సవాళ్లు స్వీకరించే సత్తా లేదు.. చాలెంజ్ ఎందుకు చేశారు

**చర్చకు దమ్ముంటే పారిపోకుండా రావాలి**



లక్ష ఇళ్లు కట్టాం.. మీరు ఒక్క ఇల్లు కట్టారా?

సవాళ్లు విసరడం పారిపోవడం రేవంత్కు అలవాటే

- 'తెలంగాణ భవన్‌కు వస్తామన్నవారు గన్‌పార్క్‌కు ఎందుకు?'
- 'సవాల్ చేసి వెనక్కి తగ్గింది కాంగ్రెస్
- జూపల్లి వ్యాఖ్యలపై కేటీఆర్ సెటైర్లు
- ప్రభుత్వానికి ఏ అంశంపైనా చర్చించే ధైర్యం లేదన్న కేటీఆర్
- గన్‌పార్క్‌కు వెళ్లిన హరీశ్‌రావు అరెస్ట్‌పై ఆగ్రహం
- 'చర్చకు దమ్ముంటే పారిపోకుండా రావాలి'
- జూపల్లికి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదన్న కేటీఆర్
- గన్‌పార్క్‌లోనే బహిరంగ చర్చకు కేటీఆర్ సిద్ధం

03



గురుకులాల్లో అవినీతి, రాష్ట్ర అప్పులపై చర్చించేందుకు హరీష్ రావు గన్ పార్క్ వద్దకు రావాలని మంత్రి అడ్లూరి చేసిన చాలెంజ్ ను ఆయన స్వీకరించారు. తెలంగాణ భవన్ నుంచి గన్ పార్కుకు బయల్దేరగా.. అక్కడే హరీష్ రావు వాహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

# తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత..

## చర్చకు బదులు అరెస్టులా?.. అధికారంపై బీఆర్ఎస్ ఫైర్

- గన్‌పార్క్ చర్చకు బయల్దేరిన హరీష్‌రావు అరెస్ట్
- మంత్రుల సవాల్ స్వీకరించి వెళ్తుంటే పోలీసుల అడ్డుకట్ట
- తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత.. బీఆర్ఎస్ కార్యకర్తల ఆగ్రహం
- 'చర్చకు పిలిచి పోలీసులతో ఆపడం ఎందుకు?' హరీష్‌రావు ప్రశ్న
- గన్‌పార్క్‌కు వెళ్లనివ్వకపోతే కాలినడకన వెళ్తామన్న హరీష్
- పోలీసులతో తోపులాటలో కిందపడిన హరీష్‌రావు
- హరీష్‌రావు సహా బీఆర్ఎస్ కార్యకర్తలు అదుపులోకి

05

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది 'బిగ్ బాస్' డ్రామా



## డ్రామాలు ఆపి.. చర్చకు రండి

- కాంగ్రెస్-బీఆర్ఎస్ రాజకీయాలు బిగ్‌బాస్ షోలా ఉన్నాయి
- వారం రోజుల రిహార్సల్‌తో డ్రామాలు చేస్తున్నారు
- అబద్ధాలు చెప్పడంలో ఇద్దరికీ ఆస్కార్ ఇవ్వొచ్చు
- నటనలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీపడుతున్నాయి
- తెలంగాణ ప్రజలు ఈ డ్రామాలు చూసి నవ్వుకుంటున్నారు
- గురుకులాలు, అప్పులపై చర్చకు బీజేపీ సవాల్
- వేదిక, తేదీ, సమయం మేమే నిర్ణయిస్తామన్న బండి
- దమ్ముంటే బహిరంగ చర్చకు రండి
- రెండు పార్టీలకూ ప్రజలు గుడ్‌బై చెప్పనున్నారన్న బండి

03



# కల్తీ మాంసం కలకలం..

- హైదరాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు
- మేక మాంసంలో కల్తీ చేసిన ఎద్దు మాంసం బట్టబయలు
- హెచ్-ఫాస్ట్, పోలీసుల సంయుక్త దాడి
- మల్లేపల్లిలో నిందితుడి అక్రమ వ్యాపారం వెలుగులోకి

02




# ఎస్సై స్టాండప్ లంచ్ టైం వరకు నిలబెట్టిన హైకోర్టు!

02

పోలీస్ అయినంత మాత్రాన చట్టాన్ని ఉల్లంఘిస్తావా అంటూ మధురానగర్ ఎస్సైపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రిటైర్డ్ ఎస్సై అయిన పిటిషనర్ ఉస్మాన్(75)ను లోదుస్తుల్లో ఉండగా ఇంటి నుంచి ఈడ్చుకెళ్లడంపై మండిపడింది.

# హామీలు అడిగితే రక్తం కళ్లజూస్తారా?

## బొల్లిగూడంలో భూపోరాటం ఉద్రిక్తం..



- బోడుప్పల్‌లో భూపోరాటం ఉద్రిక్తం
- కల్వకుంట్ల కవితతో పాటు పలువురు నేతల అరెస్ట్
- బెల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించిన నాయకులు
- మహిళలపై లాఠీచార్జ్ జరిగిందన్న కవిత ఆరోపణ
- "మహిళల రక్తం చిందింది" కవిత ఆగ్రహం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కౌంట్‌డౌన్ ప్రారంభమన్న కవిత
- హామీలు అమలు చేయాలని ఉద్యమకారుల డిమాండ్
- భూపోరాట సభకు అనుమతి నిరాకరించిన పోలీసులు
- పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు
- తెలంగాణ రక్షణ దళం పోరాటం కొనసాగింపు హెచ్చరిక

03

# తుది దశలో స్థలాల సేకరణ



రెండో, మూడో విడతల్లో మరిన్ని ఇళ్లు

దూర ప్రాంతాలకు తరలించే విధానం ఉండదన్న మంత్రి

- ఇందిరమ్మ ఇళ్ల టెండర్లకు తుది దశ
- త్వరలోనే టెండర్ల ప్రక్రియ ప్రారంభం
- క్యూఆర్ పరిధిలో స్థలాల సేకరణ వేగవంతం
- 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ అమలు
- ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు లక్ష్యం
- మొదటి విడతలో 500 నుంచి 1000 ఇళ్ల నిర్మాణం
- లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసిన మంత్రి
- రెండో, మూడో విడతల్లో మరిన్ని ఇళ్లు


03

# కల్తీ మాంసం కలకలం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీల్లో కల్లీ మాంసం కలకలం గా మారింది. ఈ రోజు ఉదయం జరిపిన ఆకస్మిక తనిఖీల్లో వరుసగా భయంకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మేక మాంసంలో ఎద్దు మాంసాన్ని కలిపి (కల్తీ చేసి) విక్రయి స్తున్న ఒక ముఠా గుట్టు రట్టయింది. H-FAST (హైదరాబాద్ ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్) అధికారులు, స్థానిక పోలీసులు ఉమ్మడిగా జరిపిన మెరుపు దాడిలో నిందితుడు ఉస్మాన్ ఖురేషి అడ్డంగా బుక్కయ్యాడు.

### 50 కేజీల మాంసం సీజ్..

నిందితుడు ఉస్మాన్ ఖురేషి మల్లెపల్లి ప్రాంతంలో షాపు నిర్వహిస్తూ.. తక్కువ ధరకే వస్తుందనే ఆశతో మేక మాంసంలో పెద్ద మొత్తంలో ఎద్దు మాంసాన్ని మిక్స్ చేస్తున్నాడు. ఈ కల్తీ మాంసాన్ని నగరంలోని ఫేమస్ బిర్యానీ పాయింట్లు, హోటళ్లకు తక్కువ ధరకే గుట్టుచప్పుడు కాకుండా సప్లై చేస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది. పక్కా సమాచారంతో సదరు షాపుపై దాడి చేసిన టాస్క్‌ఫోర్స్ బృందం.. అక్కడ విక్రయానికి సిద్ధంగా ఉంచిన 50 కేజీల కల్తీ మాంసాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసింది. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, అతని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? నగరంలో ఏయే హోటళ్లకు ఈ మాంసాన్ని సరఫరా చేశాడనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.




# ఎస్సై స్టాండప్ లంచ్ టైం వరకు నిలబెట్టిన హైకోర్టు!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పోలీస్ అయినంత మాత్రాన చట్టాన్ని ఉల్లంఘి స్తావా అంటూ మధురానగర్‌ఎస్సైపై హైకోర్టుఆగ్రహంవ్యక్తంచేసింది. రిటైర్డ్ ఎస్సై అయిన పిటిషనర్ ఉస్మాన్ (75)ను లోదుస్తుల్లో ఉండగా ఇంటి నుంచి ఈడ్చుకెళ్లడంపై మండిపడింది. మధ్యాహ్న భోజన సమయం వరకు కోర్టులోనే నిలబడాలని ఎస్సైని ఆదేశించింది. పోలీస్ కమిషనర్ నుంచి నివేదిక తెప్పించుకుని అందజేయాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది. మే 18న యూస్ఫగూడలోని తన ఇంటిలో ఉండగా పోలీసులు బలవంతంగా ఈడ్చు కెళ్లారని,వారిపై చర్యలుతీసుకోవాలంటూ రిటైర్డ్ ఎస్సై ఉస్మాన్ పిటిషన్ దాఖలు చేయగా.. జస్టిస్ టీ.మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది.

# మూడో విడత రైతు భరోసా నిధులు విడుదల!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ప్రభుత్వం 'రైతు భరోసా' పథకం అమలును దశలవారీగా కొనసాగిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో రైతు భరోసా నిధులను అధికారికంగా విడుదల చేశారు. అనంతరం అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా సొమ్ము జమ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు ఎకరాల లోపు భూమి కలిగిన 44.28 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,482 కోట్లు ప్రభుత్వం నేరుగా జమ చేసింది. అనంతరం రెండో విడతలో మూడు ఎకరాల వరకు సాగుభూమి ఉన్న రైతులకు రైతు భరోసా సాయం అందించింది.తాజాగా మూడో విడతలో భాగంగా 3 నుంచి 4 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు రైతు భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేస్తోంది. ఈ విడతలో 6.39 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.1,330.32 కోట్లు నేరుగా జమ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఇప్పటివరకు మూడు విడతల్లో కలిపి రాష్ట్రంలోని 61.35 లక్షల మంది రైతులకు రూ.5,402.37 కోట్ల రైతు భరోసా సాయం అందించబడింది. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం నిర్ణయించిన విధంగా నిధులు దశలవారీగా జమ చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.రైతులకు వ్యవసాయ పెట్టుబడి భారం తగ్గించడం, సాగు కార్యకలాపాలకు ఆర్థికంగా అండగా నిలవడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తోంది. భూమి విస్తీర్ణాన్ని ఆధారంగా చేసుకుని విడతల వారీగా నిధులు విడుదల చేస్తుండటంతో మిగిలిన అర్హులైన రైతుల ఖాతాల్లో కూడా త్వరలోనే రైతు భరోసా సాయం జమ కానుంది. రైతుల పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. 30 నెలల ప్రజాపాలనలో రైతు తలెత్తుకునేలా పాలన అందిస్తున్నామన్నారు. వ్యవసాయం దండగ కాదని, పండుగగా భావించే పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తోందని సీఎం పేర్కొన్నారు.

# ఒకేసారి సమాధానం ఇస్తా..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత ముదురుతోంది. రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన ఆర్థిక వ్యవహారాలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గురుకుల విద్యాసంస్థల్లో అవినీతి ఆరోపణలపై ఇరు పార్టీల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ రాజకీయ కేంద్రంగా మారింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌కు చేరుకుని పార్టీ నేతలతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలకు వాస్తవాలతో సమాధానం చెబుతామని, రాష్ట్ర అప్పులపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ నేతలు ప్రకటించారు.మరోవైపు మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు తాను ఇప్పటికే స్పందించానని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిన విషయాన్ని వాస్తవాలతో వెల్లడించానని పేర్కొన్నారు. హరీశ్‌రావు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్దకు వస్తానని ప్రకటించిన నేపథ్యంలో.. మంత్రి జూపల్లి కూడా అక్కడికే వస్తానని స్పష్టం చేశారు. 'బావ--బామ్మర్ది ఇద్దరూ కలిసి గన్‌పార్క్‌కు రండి. నేనూ అక్కడికే వస్తున్నాను. మీరిచ్చిన సవాల్‌కు ప్రజల ముందే వాస్తవాలతో సమాధానం చెబుతాను. బావ ఒకచోట, బామ్మర్ది మరోచోట మాట్లాడటం ఎందుకు?. ఇద్దరూ కలిసి రండి.. ఒకేసారి సమాధానం ఇస్తాను' అంటూ జూపల్లి ఘాటు వ్యాఖ్యలు చేశారు.జూపల్లి చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చకు దారి తీశాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పరం సవాళ్లు విసురుకుంటుండటంతో గన్‌పార్క్ వద్ద రాజకీయ ఉద్రిక్తత నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర అప్పుల అంశంపై బహిరంగ చర్చ జరగాలని ఇరు పార్టీలు పట్టుబడుతుండగా.. గురుకుల విద్యాసంస్థల్లో అవినీతి ఆరోపణల అంశం కూడా రాజకీయంగా వేడెక్కుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో గన్‌పార్క్, తెలంగాణ భవన్ పరిసరాల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు.అన్ని ఆధారాలతో తెలంగాణ భావం నుంచి గన్‌పార్క్‌కు బయల్దేరిన హరీశ్ రావును పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో కొద్దిసేపు తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి హరీశ్ రావు సహా బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను కాంచన్ బాగ్ పీస్ కి తరలించారు. ఇక చర్చ కోసం తెలంగాణ భవన్లో మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం సిబ్బంది చైర్ ఏర్పాటు చేయడం విశేషం.

### అప్పుల శ్వేతపత్రం విడుదల

బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలన ముగిసే నాటికి తెలంగాణ రాష్ట్రంపై అప్పులు, పెండింగ్ బిల్లులు కలిపి మొత్తం రూ.8,21,651 కోట్ల ఆర్థిక భారం మిగిలిందని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తాము చేస్తున్న వ్యాఖ్యలు నిరాధారమని ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలకు సమాధానంగా గన్ పార్కు అమరవీరుల స్థూపం సాక్షిగా ఆయన ఈ లెక్కలను మీడియా ముందుంచారు. 2014 జూన్ 2న రాష్ట్ర ఏర్పాటు సమయంలో మొత్తం బకాయిలు రూ.90,161 కోట్లు మాత్రమే ఉండగా, 2023 డిసెంబర్ 1 నాటికి అవి భారీగా పెరిగాయని వివరించారు.

### ఆయన వెల్లడించిన వివరాలు..

రాష్ట్ర ఏర్పాటు సమయంలో ఎఫ్ఆర్‌బీఎం రుణాలు రూ.72,658 కోట్లు ఉండగా, 2023 డిసెంబర్ నాటికి అవి రూ.3,89,673 కోట్లకు చేరాయి. ప్రభుత్వ హామీతో ప్రత్యేక ప్రయోజన సంస్థలు (స్పాఎం) తీసుకుని, ప్రభుత్వం చెల్లించాల్సిన రుణాలు రూ.11,609 కోట్ల నుంచి రూ.1,27,208 కోట్లకు పెరిగాయి. ఈ రెండు కలిపి ప్రభుత్వ ప్రత్యక్ష బాధ్యతగా ఉన్న అప్పులు రూ.84,268 కోట్ల నుంచి రూ.5,16,881 కోట్లకు చేరినట్లు తెలిపారు. ప్రభుత్వ హామీతో ఎస్‌పీవీలు తీసుకుని, వాటినే చెల్లించే రుణాలు రూ.5,893 కోట్ల నుంచి రూ.95,462 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. కార్పొరేషన్లు తీసుకున్న ప్రభుత్వేతర హామీ రుణాలు రూ.59,414 కోట్లు ఉన్నాయని తెలిపారు. దీంతో మెత్తం రాష్ట్ర అప్పులు రూ.6,71,757 కోట్లకు చేరాయని వివరించారు.

### పెండింగ్ బిల్లుల భారం కూడా భారీగానే..

అప్పులతో పాటు పెండింగ్ బిల్లుల భారం కూడా భారీగానే ఉందని మంత్రి తెలిపారు. ఉద్యోగులు, మూలధన పనులు, సంక్షేమ పథకాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రూ.40,154 కోట్లు, డిస్కంల విద్యుత్ బకాయిలు, సింగరేణి విద్యుత్ బకాయిలు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ బకాయిలు తదితర ఇతర పెండింగ్ చెల్లింపులు రూ.1,09,740 కోట్లు ఉన్నాయని చెప్పారు. మొత్తంగా అప్పులు, పెండింగ్ బిల్లులు కలిపి రాష్ట్రంపై రూ.8,21,651 కోట్ల ఆర్థిక భారం మిగిలిందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. కేటీఆర్.. నేను చెప్పిన లెక్కలు తప్పని.. కేసీఆర్ తో చెప్పించాలని, నా లెక్కలు తప్పని తేలితే రాజీనామాకు సిద్ధమనే మాటకు కట్టుబడి ఉన్నానని సవాల్ విసిరారు. ఈ అంశంపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, ప్రతిపక్ష నేతలు వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన సవాల్ విసిరారు.

# స్పీడ్ పోస్ట్‌తో గంజాయి సరఫరా



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేశామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఈరోజు(గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. H- Fast అధికారులు, గుడిమల్కాపూర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి నిందితుల్ని అరెస్ట్ చేశారన్నారు. గంజాయిను స్పీడ్ పోస్ట్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నారని.. జార్ఖండ్‌కు చెందిన సత్యం మిశ్రాను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇంటర్ చదివిన సత్యం మిశ్రా పెయింట్ పని చేసి మానేశాడని.. ఆ తర్వాత లారీ డ్రైవర్‌గా పనిచేశాడన్నారు. 2018లో గంజాయికి అలవాటు పడ్డ మిశ్రా.. రాహుల్ జై, సచిన్ మిశ్రా, సంతోష్‌తో సిండికేట్‌గా ఏర్పడి.. సొంత ఊరిలోనే గంజాయి పంట వేశారని తెలిపారు. ఊరిలో చాలా మందితో గంజాయి పంట పండించి కొనుగోలు చేసి కస్టమర్లకు సరఫరా చేసస్తున్నారని చెప్పారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. స్పీడ్ పోస్ట్, కొరియర్ సేవల ద్వారా 21 రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.హైదరాబాద్, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు సహా పలు నగరాలకు గంజాయి సరఫరా చేస్తున్నారని సజ్జనార్ తెలిపారు. పార్సిళ్లలో మందులు ఉన్నట్లు తప్పుడు డిక్లరేషన్ ఇచ్చి పోస్టల్ అధికారులను మోసగిస్తున్నారని.. ఇస్రీ బజార్, ఫుస్రో పోస్టాఫీసుల నుంచి స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లు బుక్ చేసినట్లు గుర్తించామన్నారు. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఆర్డర్లు తీసుకుని UPI ద్వారా నగదు లావాదేవీలు జరిగేవన్నారు. రోజుకు 80 -100 ఆర్డర్లు వస్తుండగా.. అందులో 8 నుంచి 10 వరకు స్పీడ్ పోస్ట్ పార్సిళ్ల ద్వారా గంజాయి పంపిణీ చేస్తున్నారన్నారు. ఒక్కో పార్సిల్‌లో 50 - 250 గ్రాముల గంజాయి ఉంచుతూ డెలివరీ చేస్తున్నారని.. ఒక్కో ప్యాకెట్ రూ.1,500 నుంచి రూ.8,000 వరకూ విక్రయిస్తున్నట్లు తెలిపారు. రోజుకు సుమారు రూ.1 లక్ష ఆదాయం లభించగా.. నెలకు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షలు, ఏడాదికి రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల టర్నోవర్ ఉందన్నారు. సరఫరాదారులు, కస్టమర్స్ మధ్య కోడ్స్ ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ జరుగుతుందని తెలిపారు. వాట్సాప్‌లో వివిధ కోడ్స్ ద్వారా కస్టమర్స్ గంజాయి ఆర్డర్ చేస్తున్నారని అన్నారు.వచ్చిన డబ్బుతో నిందితులు బంగారం, లగ్జరీ వాహనాలు కొనుగోలు చేశారని సీపీ వెల్లడించారు. నిందితులు పలు బ్యాంక్ ఖాతాలు, PhonePe UPI ఐడీలతో మనీలాండరింగ్ చేసినట్లు గుర్తించామన్నారు. రైళ్లు, విమానాల ద్వారా వచ్చిన స్పీడ్ పోస్ట్ పార్సిళ్లకు స్కానింగ్ లేకపోవడంతో సరఫరా సులభమైందన్నారు. పోస్టల్ పార్సిళ్లకు తప్పనిసరి స్కానింగ్ అమలు చేయాలని కేంద్ర శాఖలకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఎస్ఆర్ నగర్, గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పార్సిల్‌పై అనుమానం కలిగి దర్యాప్తు చేశామని.. హైదరాబాద్‌కు వచ్చిన 2 పార్సిల్స్ ఫ్లైట్‌లోనే వచ్చాయన్నారు. నగరంలోని అన్ని కొరియర్ సంస్థలకు ప్రతి పార్సిల్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలని ఆదేశాలు జారీ చేస్తాన్నారు. అనుమానాస్పద పార్సిళ్లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# గ్రామాల అభివృద్ధే నా లక్ష్యం



**ఇబ్రహీంపట్నం,ఫ్లాష్ ఇండియా :** గ్రామాల సమగ్ర అభివృద్ధే నా లక్ష్యమని, "ప్రతి గ్రామం మెరవాలి.. ప్రజలు మురవాలని, అందుకు అవసరమైన నిధుల మంజూరు బాధ్యత నాదే" అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, యువజన సంఘాల నాయకులు ఎమ్మెల్యేను తొర్రూర్ క్యాంపు కార్యాలయంలో కలిసి గ్రామసమస్యలను వినిపించారు. గత రెండున్నరేళ్లలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలో అంతర్గత రహదారుల అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, డ్రైనేజీ వంటి సమస్యల పై గ్రామ ప్రతినిధులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.ఇప్పటికే మంజూరైన నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై ఎమ్మెల్యే ఆరా తీసి, అవసరమైన చోట మరిన్ని నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సమస్యల రహితంగా, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. తులేకలాన్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తులేకాలన్ గ్రామ సర్పంచ్ సామ అశ్విని రవీందర్ రెడ్డి, వార్డు సభ్యులు, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.





ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# హామీలు అడిగితే రక్తం కళ్లజూస్తారా?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బోడుప్పల్‌లో భూ పోరాటం చేస్తోన్న తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవితతో పాటు వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉప్పల్ పరిధిలో జరిగిన ఈ భూ పోరాటం ఉద్రిక్తంగా మారింది. ఈ సందర్భంగా పోలీసులు ఉద్యమకారులు, మహిళలపై విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేశారని కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మహిళల రక్తం చిందింది: కల్వకుంట్ల కవిత**

బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో కవిత మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. "ఉప్పల్‌లో ఈరోజు తెలంగాణ ఉద్యమకారులు, మహిళల రక్తం చిందింది. పోలీసులు మహిళలను కూడా చూడకుండా విచక్షణారహితంగా లాఠీ ఛార్జ్ చేయడం అత్యంత అన్యాయం" అని ఆమె మండిపడ్డారు.

**కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ స్టార్ట్..**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను మాత్రమే తాము అడిగామని, అంతకుమించి ఎలాంటి ఇతర డిమాండ్లు పెట్టలేదని కవిత స్పష్టం చేశారు. "ఉద్యమకారులకు ఇస్తామన్న 250 గజాల స్థలాన్ని వెంటనే కేటాయించాలని మాత్రమే మేము డిమాండ్ చేశాం. ఇచ్చిన హామీలను అడిగితే లాఠీలతో కొట్టి రక్తం చిందించడం ప్రజాస్వామ్యమా?" అని ప్రశ్నించారు. ఈ రోజు నుంచే కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ప్రారంభమైందని ఆమె హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు, వాటిని ఈ ప్రభుత్వానికి ప్రతిరోజూ గుర్తు చేస్తూనే ఉంటామని. ఉద్యమకారుల తరఫున పోరాటం ఆపబోమని కల్వకుంట్ల కవితే తేల్చి చెప్పారు.

**బొల్లిగూడంలో భూపోరాటం ఉద్రిక్తం..**

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బొల్లిగూడంలో గురువారం తెలంగాణ రక్షణ సేన చేపట్టిన భూపోరాటం ఉద్రిక్తతకు దారితీసింది. ఉప్పల్ బాగాయత్‌లో నిర్వహించాలనుకున్న భూపోరాట సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో పాటు పలువురు నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. దీంతో సభా వేదికను బొల్లిగూడానికి మార్చగా, అక్కడ కూడా సభ నిర్వహణకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. భూపోరాట సభ కోసం ఏర్పాటు చేసిన టెంట్లను అనుమతి లేదని పేర్కొంటూ పోలీసులు తొలగించారు. దీనిని వ్యతిరేకిస్తూ తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు నిరసనకు దిగడంతో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అదనపు పోలీసు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. భూపోరాటంలో పాల్గొనేందుకు బొల్లిగూడానికి వచ్చిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పోలీసులు అదుపులోకి తీసుకుని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కవిత అరెస్టును నిరసిస్తూ కార్యకర్తలు నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించారు. ఇదిలా ఉండగా, బొల్లిగూడం ప్రాంతంలోని దళితుల భూములను ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ విధానంలో స్వాధీనం చేసుకుని ఎకరానికి 600 గజాల చొప్పున ప్లాట్లు కేటాయించే ప్రక్రియ కొనసాగుతోందని స్థానిక దళితులు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన చేపట్టిన భూపోరాటాన్ని కొందరు స్థానికులు వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. భూపోరాటం సందర్భంగా అదుపులోకి తీసుకున్న తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలను ఘట్‌కేసర్‌తో పాటు పలు పోలీస్ స్టేషన్లకు తరలించినట్లు సమాచారం. దీనికి నిరసనగా కార్యకర్తలు ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టి, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం బొల్లిగూడం ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తుండగా, పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# తుది దశలో స్థలాల సేకరణ




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు త్వరలో టెండర్లు తుది దశలో స్థలాల సేకరణ దశలవారీగా ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా వెయ్యి ఇళ్ల వరకునిర్మాణం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యూర్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతంలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే టెండర్లు పిలవనుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ మరో రెండు నుంచి మూడు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. గోషామహల్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన పట్టాలను గురువారం నాడు మంత్రి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, స్థానికఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం "ప్రతి పేద కుటుంబానికి ఇల్లు" అనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలోని 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కో చోట కనీసం 500 నుంచి 1000 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం రెండో, మూడో విడతల్లో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే ఒక్కో నియోజకవర్గానికి 5500 వరకు ఇళ్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేస్తూ, పట్టణ ప్రాంతాల్లో భూమి విలువ ఎకరాకు రూ. 100 నుంచి రూ. 200 కోట్ల వరకు ఉన్నా కూడా ఆ భూముల విలువను పక్కనబెట్టి పేదలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి వారి పేరిట పట్టాలు ఇస్తామని మంత్రి తెలిపారు. ధూల్‌పేట ప్రాంతంలో గత ప్రభుత్వ కాలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన 125 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అందిస్తున్నామని, మిగిలిన పేదలకు కూడా ఇళ్లు మంజూరు చేసేలా పరిసర ప్రాంతాల్లో స్థలాలను గుర్తించేందుకు కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పేదలను నగరాల నుంచి 30 కిలోమీటర్ల దూరంలోకి తరలించి ఇళ్లు కట్టే విధానం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉండదని, వారి జీవనాధారాలకు దగ్గరగా, అదే నియోజకవర్గ పరిధిలోనే ఇళ్లు అందించడం ప్రభుత్వ కట్టుబాటు అని మంత్రి స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే కేవలం రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ ఇళ్లు నిర్మిస్తుందని, అది సాధ్యం కాకపోతే తాను రానున్న ఎన్నికల్లో పోటీ చేయనని విసిరిన సవాల్‌కు ఇప్పటివరకు బీఆర్ఎస్ నేతల నుంచి స్పందన రాలేదని గుర్తుచేశారు. పేదల ఇళ్ల నిర్మాణంలో ప్రయోజనం లేదనే ఆలోచనతో బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టుల పేరుతో అవినీతికి పాల్పడిందని ఆరోపిస్తూ, కాంగ్రెస్ మాత్రం అదే నిధులను పేదల గూడు కోసం వినియోగిస్తోందన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా గుడిసెల్లేని తెలంగాణ లక్ష్యాన్ని సాధిస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది 'బిగ్ బాస్' డ్రామా



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య సాగుతున్న తాజా రాజకీయ పరిణామాలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరు పార్టీల వైఖరిని ఎండగడుతూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' (X) వేదికగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు, ప్రతి విమర్శలు చూస్తుంటే పాపులర్ రియాలిటీ షో 'బిగ్ బాస్ ను తలపిస్తోందని ఎద్దేవా చేశారు. వారం ముందే రిహార్సల్ చేసుకుని మరీ ఇరు పార్టీల నేతలు పోటాపోటీగా నటనలో జీవిస్తున్నారని, అబద్ధాలు చెప్పడంలో వీరికి ఆస్కార్ అవార్డు ఇస్తే ఇద్దరు దానికి పూర్తిగా అర్హులవుతారని బండి సంజయ్ ఘాటుగా విమర్శించారు. నేతల డ్రామాలను చూసి తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారని బండి సంజయ్ పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల పాలనా వైఫల్యాలను, అక్రమాలను ప్రజల ముందుంచేందుకు బీజేపీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందంటూ కేంద్ర మంత్రి బహిరంగ సవాల్ విసిరారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో చర్చకు సంబంధించిన డేట్, టైం, వేదికను తామే ఫిక్స్ చేస్తామని, దమ్ముంటే గురుకులాల టెండర్లు, తెలంగాణను ముంచిన అప్పులు, అవినీతిపై చర్చకు రావాలని సవాల్ చేశారు. అదే వేదికపై కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కేటాయించిన నిధులు, సంక్షేమ పథకాలపై కూడా చర్చించవచ్చని స్పష్టం చేశారు. నాయకులు ఇలాగే డ్రామాలాడితే జనం ఛీ కొట్టడం ఖాయమని హెచ్చరించిన బండి సంజయ్.. ఈ 'రాజకీయ బిగ్ బాస్ షో'లో ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు 'డబుల్ ఎలిమినేషన్' ఖరారు చేశారని, రాష్ట్రంలోనూ 'డబుల్ ఇంజిన్ సర్కార్' రావాలని ఆకాంక్షిస్తున్నారని తేల్చిచెప్పారు.

# అవినీతి జరిగింది కాబట్టే...

## మమ్మల్ని చర్చకు వెళ్లకుండా అడ్డుకున్నారు: హరీష్ రావు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** జూపల్లి కృష్ణారావుకు చీము నెత్తురు ఉంటే వెంటనే రాజీనామా చేయాలని హరీష్ రావు అన్నారు. నిన్న బీఆర్ఎస్ ప్రభుత్వం 8 లక్షల కోట్లు అప్పు చేసింది అన్నాడు, ఈరోజు 7 లక్షల కోట్లు అప్పు చేసిందని అంటున్నారని చెప్పారు. నిన్నటికి ఈరోజుకే లక్ష తగ్గిందా అని ప్రశ్నించారు. ఇవాళ చర్చ జరిగి ఉంటే రెండు లక్షలకో మూడు లక్షలకో ఒప్పుకునేవారని అన్నారు. కేటీఆర్ రేవంత్ రెడ్డికి సవాల్ విసిరితే, జూపల్లి కృష్ణారావు నేను తెలంగాణ భవన్‌కు వస్తానని, ఈరోజు సబ్జెక్ట్ లేక తోక ముడిచి వెళ్ళిపోయాడని ఎద్దేవా చేశారు. గురుకుల టెండర్లలో అవినీతి జరిగింది కాబట్టే తమను చర్చకు వెళ్లకుండా అడ్డుకుని అరెస్ట్ చేయించారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వస్తారంటే హరీష్ రావు రావాలి, గన్ పార్క్ వద్దకు రావాలన్నారు.. సరే అని నేను వెళ్తుంటే అరెస్ట్ చేసి కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్లో బంధించారని చెప్పారు. అక్కడ కూడా కుర్చీ వేసి మంత్రులను చర్చకు రమ్మని ఆహ్వానించానన్నారు. చర్చలు జరిగితే బండారం అంతా బయటపడుతుందని భయంతో, చర్చలు జరగకుండా తమను అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# చాలెంజ్ ఎందుకు చేశారు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అప్పులపై చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి తొలుత సవాల్ చేశారని, ఆ సవాలును తాము స్వీకరించాక తోకముడిచారని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయం వేడెక్కిన వేళ.. తెలంగాణ భవన్ వద్ద కేటీఆర్ హాట్ కామెంట్స్ చేశారు. సీఎం చర్చకు స్పందించకుండా ఉన్నపుడు.. సందట్లో సడేమియాలా మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్యలో దూరారన్నారు. తెలంగాణ భవన్ కు వచ్చి అప్పులపై చర్చిస్తామని అన్నారని, అందుకే ఆయన కోసం ఎదురుచూశామన్నారు. ఇప్పుడేమో గన్ పార్క్ వద్దకు రావాలంటున్నారని, అక్కడికి వెళ్లాక చార్మినార్ కు రావాలంటారేమో అని సెటైర్లు వేశారు. తెలంగాణ భవన్ కు వస్తామన్న జూపల్లి గన్ పార్క్ వద్దకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. చర్చకు రెడీ అని డైలాగులు కొట్టి పారిపోవడం కాదని, దమ్ముంటే చర్చించేందుకు రావాలన్నారు. గన్ పార్క్ వద్దకు వెళ్తున్న హరీష్ రావు, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయిస్తోంది ఎవరు? అని ప్రశ్నించారు. తన శాఖలో ఏం జరుగుతుందో కూడా మంత్రి జూపల్లికి తెలియదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పంచాయతీతో ఒక ఐఏఎస్ అధికారి రాజీనామా కూడా చేశారని, సీఎం రేవంత్ పాలన అసమర్థుడి జీవన యాత్రలా ఉందని దుయ్యబట్టారు. హైదరాబాద్ లో తాము లక్ష ఇళ్లను నిర్మించామని, కాంగ్రెస్ సర్కార్ ఒక్క ఇల్లు కట్టినా దేనికైనా రెడీగా ఉన్నామన్నారు. జూపల్లికి దమ్ముంటే గన్ పార్క్ వద్దే ఉండాలని, అక్కడే అన్నీ చర్చిద్దామన్నారు. ప్రభుత్వానికి దేనిపైనా చర్చించే దమ్ములేదన్న కేటీఆర్.. చేతకానివాళ్లు ఎందుకు సవాల్ చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజల ముందు అన్ని వాస్తవాలను ముందుంచుతామని అనుకున్నామన్నారు. సవాళ్లను స్వీకరించే సత్తా ముఖ్యమంత్రి, మంత్రులకు లేదని మరోసారి తేలిపోయిందన్నారు.

బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసి తరలించిన కంచన్ బాగ్ పీఎస్ వద్దకే వెళ్దామని, అక్కడైనా చర్చించే దమ్ముందా అని ప్రశ్నించారు. హరీష్ రావుతో పాటు అరెస్ట్ చేసిన ఇతర బీఆర్ఎస్ నేతలందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు

సీఎం రేవంత్ కు కేటీఆర్ మరో చాలెంజ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వ అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చించేందుకు.. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశాల్లో స్పీకర్ తమను అడ్డుకోకుండా.. అన్నీ చర్చించనివ్వాలన్నారు.

# ఇకపై టీచర్లకూ మధ్యాహ్న భోజనం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరుగుతున్న తెలంగాణ తొలి 'ఈ-కేబినెట్' భేటీలో విద్యా రంగానికి సంబంధించి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు పనిచేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బంది అందరికీ ఉచితంగా అల్పాహారం , మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అయితే, ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకం, కొన్నిచోట్ల సీఎం అల్పాహార పథకం అమలు అవుతోంది. అయితే, ఇకపై పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో విద్యార్థులతో పాటు రోజంతా విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, నాన్-టీచింగ్ స్టాఫ్, ఇతర సిబ్బందికి కూడా ఈ ఉచిత భోజన సదుపాయాన్ని విస్తరించాలని కేబినెట్ తీర్మానించింది. తాగాజ నిర్ణయంతో విద్యాసంస్థల్లో నాణ్యమైన సమయం గడపడానికి, టీచర్లు సకాలంలో అందుబాటులో ఉండటానికి మరింత వీలు కలుగుతుందని సర్కార్ భావిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ సంఘాలు, విద్యా రంగ సిబ్బంది, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సుప్రీంకోర్టుకు వెళ్లాలనే యోచన!**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ భేటీ వాడీవేడిగా కొనసాగుతోంది. సమావేశంలో భాగంగా తొలుత కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'వీబీజీ రామ్‌జీ' పథకంపై విస్తృతంగా చర్చించినట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు పథకంపై కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని సమాచారం. 'వీబీజీ రామ్‌జీ'పై తెలంగాణ ప్రభుత్వం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును ఆశ్రయించాలని మంత్రివర్గం డిసైడ్ అయినట్లుగా తెలుస్తోంది.

# ప్రతి ఒక్క ఓటు ముఖ్యమే..



**కొండమల్లేపల్లి,ఫ్లాష్ ఇండియా :** ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఓటును కాపాడే బాధ్యత కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలపై ఉందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లేపల్లిలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), బూత్ కమిటీ సభ్యులు, ముఖ్య కార్యకర్తల కోసం నిర్వహించిన ఓటర్ల సవరణ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రతి బీఎల్ఏ పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తగా 18 ఏళ్లు పూర్తిచేసుకున్న యువత పేర్లు నమోదు చేయడంతో పాటు, పొరపాట్లతో తొలగించిన లేదా తప్పులు ఉన్న ఓట్లను వెంటనే సవరించాలని కోరారు. అనంతరం సవరణ కార్యక్రమానికి సంబంధించిన కొత్త నమోదు, మార్పులు, తొలగింపులు, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలపై బీఎల్ఏలు, బూత్ కమిటీ సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే సమగ్ర అవగాహన కల్పించి కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి బూత్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులు, చదువుకున్న యువత, పార్టీ కార్యకర్తలు చురుకుగా పాల్గొని ప్రతి ఓటును కాపాడడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే బాలు నాయక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నాయిని జమున మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్ రెడ్డి, సీనియర్ నాయకుడు దూదిపాల శ్రీధర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు ఊట్కూరి వేమన్ రెడ్డి, కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మేకల శ్రీనివాస్ యాదవ్, కోలుముంతల్ పహాడ్ సర్పంచ్ రవి నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఏకుల సురేష్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, బీఎల్ఏలు, బూత్ కమిటీ సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.




# బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదు

**మహబూబ్‌నగర్,ఫ్లాష్ ఇండియా :** ప్రజల సంక్షేమం, పారదర్శక పాలన, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పట్టణంలోని 16వ వార్డు బోయపల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్యాంసుందర్ గౌడ్, సుదర్శన్ గౌడ్, శేఖర్ గౌడ్, మధుసూదన్ గౌడ్, పురుషోత్తంరావుతో పాటు సుమారు 150 మంది కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం పెరిగిందని అన్నారు. దీంతో ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, స్థానికంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల మద్దతును మరింత పెంచుతున్నాయని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు తగిన గౌరవం, గుర్తింపు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేష్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, రాములు యాదవ్, మైత్రి యాదయ్య, మున్నూరు రవి, అజ్మత్ అలీ, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బెంగళూరు క్వారీ ప్రమాదంపై సీఎం డీకే శివకుమార్ ఫైర్..

**బెంగళూరు :** బెంగళూరు క్వారీ ప్రమాదంపై సీఎం డీకే శివకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. లైసెన్స్ లేని క్వారీలను వెంటనే రద్దు చేయాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కాగా ఈ ప్రమాదం బెంగళూరు శివారు ప్రాంతంలోని కావేరీ క్వారీలో చోటు చేసుకుంది. కార్మికులు పనిచేస్తున్న సమయంలో పై భాగంలో ఉన్న బండరాయి విరిగి కిందపడింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు అక్కడికక్కడే మరణించారు. గాయపడిన మరో ఆరుగురికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో భారీ శబ్దం రావడంతో చుట్టుపక్కలవారు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. మృతులు బిహార్ కు చెందినవారిగా తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపడుతున్నాయి. శిథిలాల కింద మరికొందరు ఉండటంతో భారీ యంత్రాలతో సహాయ చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే క్వారీ పరిసరాలను మూసివేసి ఎవరినీ లోపలకు అనుమతించకుండా అడ్డుకుంటున్నారు.

# సంపాదకీయం

# అరెస్టైతే పదవి రద్దా?..

భారత ప్రజాస్వామ్యంలో రాజకీయ నాయకుల జవాబుదారీతనం గురించి చర్చ కొత్తది కాదు. అధికారంలో ఉన్న వ్యక్తులపై అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం, ఆర్థిక నేరాలు, హింసాత్మక కేసులు నమోదవుతున్న సందర్భాలు తరచూ కనిపిస్తుంటాయి. అదే సమయంలో రాజకీయ కక్షసాధింపులో భాగంగా తప్పుడు కేసులు నమోదు చేయడం, అరెస్టులను రాజకీయ ఆయుధాలుగా ఉపయోగించడం కూడా భారత రాజకీయాల్లో అపరిచితమైన విషయం కాదు. ఈ రెండు వాస్తవాల మధ్య సమతుల్యత ఎలా సాధించాలన్న ప్రశ్నకు సమాధానం వెతుకుతూ వస్తున్న తరుణంలో వివాదాస్పద 130వ రాజ్యాంగ సవరణ బిల్లు మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు తెరలేపుతోంది. జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలిస్తున్న ఈ బిల్లులోని అత్యంత కీలకమైన ప్రతిపాదన ఏమిటంటే... తీవ్రమైన నేరారోపణలపై అరెస్టై వరుసగా 30 రోజుల పాటు జ్యుడీషియల్ లేదా పోలీసు కస్టడీలో ఉంటే ప్రధాని, ముఖ్యమంత్రులు, కేంద్ర లేదా రాష్ట్ర మంత్రులు తమ పదవులను ఆటోమేటిక్‌గా కోల్పోవాల్సి ఉంటుంది. ఈ ప్రతిపాదన తొలిచూపుకు రాజకీయ వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంచే సంస్కరణగా కనిపించినప్పటికీ, లోతుగా పరిశీలిస్తే అనేక రాజ్యాంగపరమైన, న్యాయపరమైన, రాజకీయ ప్రశ్నలను లేవనెత్తుతోంది.

**జవాబుదారీతనం అవసరమే... కానీ ఏ దశలో?**

ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్న ప్రతి వ్యక్తి చట్టానికి అతీతుడు కాదు. సాధారణ పౌరుడికి వర్తించే చట్టమే ప్రధానమంత్రి నుంచి గ్రామ సర్పంచ్ వరకు అందరికీ వర్తించాలి. ఇదే రాజ్యాంగ స్ఫూర్తి. అయితే అదే సమయంలో భారత న్యాయవ్యవస్థ "నేరం రుజువయ్యే వరకు ప్రతి ఒక్కరూ నిర్దోషులే" అనే ప్రాథమిక సూత్రాన్ని కూడా అనుసరిస్తుంది. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. ఒక వ్యక్తి అరెస్టయ్యాడంటే అతను నేరస్థుడిగా నిర్ధారణ అయినట్లేనా? కస్టడీలో ఉన్నాడనే కారణంతో ప్రజలు ఎన్నుకున్న పదవిని వెంటనే కోల్పోవడం న్యాయసమ్మతమేనా? లేక తుది తీర్పు వచ్చే వరకు వేచి చూడాలా? ఈ సందిగ్ధతకు సమాధానం అంత సులభం కాదు.

**అరెస్టు అంటే శిక్ష కాదు**

భారతదేశంలో అరెస్టు అనేది విచారణలో భాగమైన ప్రక్రియ మాత్రమే. అది శిక్ష కాదు. అనేక సందర్భాల్లో కోర్టులు కూడా అనవసర అరెస్టులను తప్పుబట్టాయి. సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో "అరెస్టు అనేది చివరి మార్గం కావాలి" అని స్పష్టం చేసింది. అలాంటి పరిస్థితుల్లో కేవలం 30 రోజుల కస్టడీ ఆధారంగా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వ అధినేత పదవి కోల్పోవడం రాజ్యాంగపరంగా కూడా తీవ్రమైన చర్చకు దారితీయవచ్చు. ఒకవేళ తర్వాత కోర్టు ఆయనను పూర్తిగా నిర్దోషిగా ప్రకటిస్తే? ఆ మధ్యకాలంలో జరిగిన రాజకీయ పరిణామాలకు ఎవరు బాధ్యత వహిస్తారు? కోల్పోయిన పదవిని తిరిగి ఎలా పునరుద్ధరిస్తారు? ఇలాంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం లేకుండా చట్టం తీసుకురావడం భవిష్యత్తులో కొత్త వివాదాలకు దారితీయొచ్చు.

**రాజకీయ కక్షసాధింపుకు అవకాశం ఉందా?**

ఈ బిల్లుపై వ్యక్తమవుతున్న అతిపెద్ద ఆందోళన ఇదే. భారత రాజకీయ చరిత్రలో అధికార మార్పుల తర్వాత ప్రత్యర్థి నేతలపై కేసులు నమోదు కావడం కొత్త విషయం కాదు. కేంద్రంలో ఒక పార్టీ అధికారంలో ఉంటే ప్రతిపక్ష రాష్ట్రాల నాయకులపై కేంద్ర సంస్థల దర్యాప్తు పెరుగుతుందనే విమర్శలు వస్తుంటాయి. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రతిపక్ష నాయకులపై కేసులు నమోదు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒక ముఖ్యమంత్రి లేదా మంత్రి కేవలం 30 రోజుల పాటు కస్టడీలో ఉంటే పదవి కోల్పోతారనే నిబంధన అమల్లోకి వస్తే, అది రాజకీయ ప్రత్యర్థులను బలహీనపరిచే సాధనంగా మారే ప్రమాదం ఉందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే జేపీసీ కూడా కొన్ని రక్షణ చర్యలను చేర్చాలని ఆలోచించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఆ రక్షణ చర్యలు ఎంత బలంగా ఉంటాయన్నదే ఈ బిల్లు భవిష్యత్తును నిర్ణయించనుంది.

**ప్రజల తీర్పు కంటే అరెస్టుకు ఎక్కువ ప్రాధాన్యమా?**

ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు. ఎన్నికల్లో కోట్లాది మంది ఓటర్లు ఒక నాయకుడికి అధికారం అప్పగిస్తారు. అలాంటి వ్యక్తి పదవి ఒక పోలీసు చర్య ఆధారంగా వెంటనే రద్దు కావడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుకూలమా అనే ప్రశ్న కూడా వస్తోంది. ఒక ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి ప్రజల మద్దతుతో ఎన్నికవుతారు. వారి ప్రభుత్వాన్ని కూల్చే అధికారం సాధారణంగా శాసనసభ లేదా పార్లమెంట్‌లో మెజారిటీ కోల్పోయినప్పుడు మాత్రమే వస్తుంది. అలాంటిది అరెస్టు ఆధారంగా ఆటోమేటిక్‌గా పదవి కోల్పోయే పరిస్థితి వస్తే, ఎన్నికల ద్వారా ఏర్పడిన ప్రజా తీర్పుపై పరిపాలనా చర్య ప్రభావం చూపినట్లవుతుంది.

**మరోవైపు ప్రజలు అడిగే ప్రశ్న కూడా ఉంది**


అయితే ఈ బిల్లుకు మద్దతు ఇచ్చేవారి వాదన కూడా పూర్తిగా కొట్టిపారేయలేము. తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటూ, నెలల తరబడి జైలులో ఉండే వ్యక్తి ఒక రాష్ట్రాన్ని లేదా దేశాన్ని ఎలా పాలిస్తారు? అధికార బాధ్యతలు సమర్థవంతంగా ఎలా నిర్వహిస్తారు? పరిపాలనపై దాని ప్రభావం ఏమిటి? సాధారణ ప్రభుత్వ ఉద్యోగి అరెస్టయితే విధుల నుంచి తప్పుకుంటాడు. న్యాయమూర్తులు, ఉన్నతాధికారులపై కూడా నైతిక ప్రమాణాలు అమలవుతాయి. మరి అత్యున్నత రాజకీయ పదవుల్లో ఉన్నవారికి మరింత ఉన్నత ప్రమాణాలు ఎందుకు ఉండకూడదనే వాదన కూడా బలంగా వినిపిస్తోంది. ఇది కేవలం చట్టపరమైన అంశం మాత్రమే కాదు; ప్రజా నైతికతకు సంబంధించిన ప్రశ్న కూడా.

**ఇతర ప్రజాస్వామ్య దేశాల్లో పరిస్థితి ఎలా ఉంది?**

ప్రపంచంలోని చాలా ప్రజాస్వామ్య దేశాల్లో అరెస్టు జరిగిన వెంటనే పదవి రద్దయ్యే నిబంధనలు చాలా అరుదుగా కనిపిస్తాయి. చాలా దేశాల్లో రాజీనామా అనేది రాజకీయ ఒత్తిడి, నైతిక బాధ్యత లేదా పార్టీ నిర్ణయం ఆధారంగా జరుగుతుంది. కొన్ని దేశాల్లో కోర్టు దోషిగా తేల్చిన తర్వాత మాత్రమే అనర్హత అమల్లోకి వస్తుంది. అందువల్ల భారతదేశం ప్రతిపాదిస్తున్న ఈ విధానం అమల్లోకి వస్తే, అది ప్రపంచ ప్రజాస్వామ్యాల్లో అరుదైన రాజ్యాంగ ప్రయోగంగా నిలిచే అవకాశం ఉంది.

**జేపీసీ ముందు ఉన్న అసలు సవాలు**

కమిటీ ఇప్పుడు రెండు పరస్పర విరుద్ధమైన లక్ష్యాల మధ్య సమతుల్యత సాధించాల్సిన పరిస్థితిలో ఉంది. ఒకవైపు రాజకీయ నాయకుల్లో జవాబుదారీతనం పెరగాలి. తీవ్రమైన నేర ఆరోపణలు ఎదుర్కొంటూ అధికారంలో కొనసాగడం ప్రజాస్వామ్య విశ్వసనీయతను దెబ్బతీయకూడదు. మరోవైపు నిరాధార కేసులు, రాజకీయ ప్రేరేపిత అరెస్టులు, అధికార దుర్వినియోగం కారణంగా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు అస్థిరతకు గురికాకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యతే బిల్లు విజయాన్ని నిర్ణయిస్తుంది. రక్షణ చర్యలు ఎంత బలంగా ఉంటే అంత మంచిదిజేపీసీ సూచించబోయే రక్షణ చర్యలు అత్యంత కీలకం కానున్నాయి. ఉదాహరణకు, కేవలం ఎఫ్ఐఆర్ ఆధారంగా కాకుండా, కోర్టు నిర్దిష్ట పరిశీలన తర్వాత మాత్రమే నిబంధన అమల్లోకి రావాలా? ప్రత్యేక న్యాయపరమైన పర్యవేక్షణ అవసరమా? సుప్రీంకోర్టు లేదా హైకోర్టు అనుమతి వంటి అదనపు రాజ్యాంగ రక్షణలు అవసరమా? వంటి అంశాలు పరిశీలించాల్సి ఉంటుంది. లేకపోతే ఈ చట్టం ప్రజా జీవితంలో నైతికతను పెంచే సాధనంగా కాకుండా రాజకీయ పోరాటాల్లో మరో ఆయుధంగా మారిపోయే ప్రమాదం ఉంది. 130వ రాజ్యాంగ సవరణ బిల్లు కేవలం ఒక న్యాయ సవరణ కాదు. ఇది ప్రజాస్వామ్యంలో అధికార బాధ్యత, వ్యక్తిగత హక్కులు, న్యాయ ప్రక్రియ, ప్రజల తీర్పు, రాజకీయ నైతికత ఈ ఐదు అంశాల మధ్య సమతుల్యతను పరీక్షించే రాజ్యాంగ చర్చ. జవాబుదారీతనం పెరగాలి అనేది అందరి అభిప్రాయమే. కానీ ఆ జవాబుదారీతనం ప్రజాస్వామ్య మూల సూత్రాలను బలహీనపరచకుండా, న్యాయ ప్రక్రియను గౌరవిస్తూ, రాజకీయ దుర్వినియోగానికి అవకాశం లేకుండా ఉండేలా చట్టం రూపొందించడమే అసలు సవాలు. పార్లమెంట్ ముందుకు రానున్న ఈ బిల్లుపై జరగబోయే చర్చ కేవలం ఒక చట్టంపై కాకుండా భారత ప్రజాస్వామ్యం భవిష్యత్తు ప్రమాణాలపై కూడా జరిగే చర్చగానే చూడాల్సిన అవసరం ఉంది.




# నాయకుల్లో అసంతృప్తి!

యాదగిరిగుట్ట అభివృద్ధికి కీలకంగా భావించే యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ(వైటీడీఏ) పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది. ముఖ్యంగా యాదగిరిగుట్ట ఆలయ పరిధిలోనే ఉన్న ఆలేరు, భువనగిరి నియోజకవర్గాలకు తగిన ప్రాధాన్యం దక్కుతుందనే అంచనాలు ఉన్నప్పటికీ, తుది జాబితా ఆ ఆశలను నీరుగార్చింది. ఆలేరు నియోజకవర్గంలో అయితే ఈ అసంతృప్తి మరింత తీవ్రంగా కనిపిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం వైటీడీఏకు ఛైర్మన్‌తో పాటు సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ బోర్డులో స్థానిక రాజకీయ, సామాజిక వర్గాలకు పెద్దగా అవకాశం దక్కలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి కోసం తీసుకునే కీలక నిర్ణయాల్లో స్థానికుల పాత్ర మరింత ఉండాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

**ఆలేరు కాంగ్రెస్‌లో తీవ్ర నిరాశ..**

గత కొద్ది రోజులుగా ఆలేరు నియోజకవర్గానికి చెందిన నాయకత్వానికి వైటీడీఏ పాలకవర్గంలో అవకాశం లభిస్తుందనే ప్రచారం జరిగింది. పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం దక్కుతుందనే ఆశతో కాంగ్రెస్ శ్రేణులు ఎదురుచూశాయి. అయితే తుది జాబితాలో ఆలేరు నియోజకవర్గానికి అవకాశం లేకపోవడంతో కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురయ్యారు. ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్న నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

**భువనగిరిలోనూ అదే పరిస్థితి..**

భువనగిరి నియోజకవర్గంలో కూడా ఇదే తరహా పరిస్థితి నెలకొంది. యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాలకు భువనగిరి ప్రాంతానికి ప్రత్యక్ష సంబంధం ఉన్నప్పటికీ, స్థానిక నాయకత్వానికి బోర్డులో స్థానం కల్పించకపోవడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాకు మరింత ప్రాధాన్యం లభిస్తుందనే అంచనాలు ఉన్నప్పటికీ, వైటీడీఏ పాలకవర్గ నియామకాల్లో అవి కనిపించలేదని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.

**రాజగోపాల్ రెడ్డి అసంతృప్తి..**

వైటీడీఏ పాలకవర్గం ఏర్పాటు అంశంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. బోర్డు ఏర్పాటు విషయంలో స్థానిక సీనియర్ నేతగా, ఎమ్మెల్యేగా ఉన్న తనకు కనీస సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన మునుగోడు నియోజకవర్గం ఈ యాదాద్రి భువనగిరి జిల్లాలోనే ఉందని అయినా కూడా తనకు కనీస సమాచారం ఇవ్వకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజగోపాల్ రెడ్డి ఈ విషయంపై అసంతృప్తి వ్యక్తం చేయడంతో ఈ అంశం జిల్లాలో మరింత చర్చనీయాంశంగా మారింది.

**స్థానికుల్లో భిన్నాభిప్రాయాలు..**

యాదగిరిగుట్టలోని స్థానిక ప్రజలు, వివిధ వర్గాల ప్రతినిధులు, రాజకీయ నాయకుల్లో కూడా వైటీడీఏ పాలకవర్గం పై మిశ్రమ స్పందన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. యాదగిరిగుట్ట అభివృద్ధి కోసం ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్న స్థానికులకు మరింత ప్రాధాన్యం కల్పించి ఉంటే బాగుండేదనే అభిప్రాయం వినిపిస్తోంది. క్షేత్ర స్థాయి పరిస్థితులు తెలిసిన వారికి బోర్డులో అవకాశం ఇస్తే అభివృద్ధి కార్యక్రమాల అమలుకు మరింత ఉపయోగకరంగా ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీనిపై అటు బీఆర్ఎస్ నాయకులు, స్థానిక బీజేపీ నాయకులు సైతం స్థానికులకు కనీస గుర్తింపు ఇవ్వకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్య చేశారు.

**రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న బోర్డు..**

వైటీడీఏ పాలకవర్గానికి సాధారణ నామినేటెడ్ బోర్డు కంటే ఎక్కువ ప్రాధాన్యం ఉంది. యాదగిరిగుట్ట ఆలయ పరిసర ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, భూసేకరణ, మాస్టర్ ప్లాన్ అమలు వంటి కీలక అంశాలపై ఈ బోర్డు నిర్ణయాలు తీసుకోనుంది. అలాంటి కీలక బోర్డులో ఉమ్మడి నల్గొండ జిల్లాకు, ముఖ్యంగా ఆలేరు, భువనగిరి నియోజకవర్గాలకు ఆశించిన స్థాయిలో ప్రాతినిధ్యం దక్కలేదనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ప్రధాన అంశంగా మారింది. వైటీడీఏ బోర్డు నియామకాలతో మొదలైన అసంతృప్తిని పార్టీ అధిష్ఠానం ఎలా చల్లారుస్తుందన్నది ఇప్పుడు ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది..

# బోసిపోయిన జలాశయాలు...




రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించి నెల రోజులు పూర్తయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. మరికొన్ని చోట్ల ఆశించిన మేర వర్షాలు లేవు. రాష్ట్ర వ్యాప్తంగా చాలా వరకు మండలాల్లో లోటు వర్షపాతమే ఉన్నది. దాంతో రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలు సైతం నీరు లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. జూన్‌లోనే వర్షాలు ప్రారంభమై.. ఎగువ ప్రాంతాల నుంచి వరద వచ్చి అంతో ఇంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకోవడం చూస్తుంటాం. కానీ.. ఈసారి జూన్ ముగిసే నాటికీ శ్రీశైలం, నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, సింగూర్, నిజాంసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టుల్లో నిల్వలు ఆశించిన స్థాయికి చేరలేదు. ప్రాజెక్టులకు నీరు వస్తున్నా.. భారీ వరద ప్రవాహాలు లేకపోవడంతో నిల్వలు కనిపించడం లేదు. అటు గ్రామాల్లో సైతం వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు సైతం ఎండిపోయి కనిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో అయితే పూర్తిస్థాయిలో చెరువులు ఎండిపోవడంతో రైతులు ఆకాశానికేసి వర్షాల కోసం చూస్తున్నారు. గత ఏడాది ఈ సమయానికి అనుకున్న స్థాయిలో వర్షాలు పడడంతో జలాశయాల్లోకి నీరు వచ్చి చేరింది. ముఖ్యంగా కృష్ణా పరివాహక ప్రాంతం మాత్రం భారీ వర్షాలు, వరదలతో నిండిపోయింది. గోదావరి పరివాహకంలో మెల్లమెల్లగా వరదలు ఊపందుకున్నాయి.

**ఎగువ నుంచి వచ్చే వరదే కీలకం..**

జూన్ మాసంలోనే వర్షాలు కురియాల్సిఉన్నా.. భారీ వర్షాలు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా కనిపించలేదు. దీంతో వరద నీరు వచ్చిందీ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) విడుదల చేసిన తాజా అంచనాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. జూలై నెలలోనూ దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ స్పష్టం చేసింది. ఇప్పటికే జూన్ నెలలో దేశవ్యాప్తంగా గణనీయమైన వర్షపాతం లోటు నమోదైంది. ముఖ్యంగా మధ్య భారతదేశంలో 50 శాతానికి పైగా లోటు ఉండటం కృష్ణా, గోదావరి నదుల ఎగువ క్యాచ్మెంట్లపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉన్నదని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలోని శ్రీశైలం, నాగార్జునసాగర్, జూరాల వంటి కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు కర్ణాటక, మహారాష్ట్రలోని క్యాచ్మెంట్ ప్రాంతాల్లో కురిసే వర్షాలే ప్రధాన ఆధారం. అలాగే.. శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి వంటి గోదావరి ప్రాజెక్టులకు మహారాష్ట్రలో కురిసే వర్షాలే కీలకం. రాష్ట్రంలో స్థానికంగా కురిసే వర్షాలు చెరువులు, చిన్న రిజర్వాయర్లు నింపడానికి, భూగర్భ జలాలు పెరగడానికి ఉపయోగపడతాయి. కానీ.. భారీ జలాశయాల్లో నిల్వలు గణనీయంగా పెరగాలంటే ఎగువ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వరద ప్రవాహాలు రావాల్సిందే. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించకపోవడంతో ప్రాజెక్టులకు ఇన్ ఫ్లో పరిమితంగానే ఉంది. మహారాష్ట్ర, కర్ణాటకలోని ఎగువ క్యాచ్మెంట్ ప్రాంతాల్లో విస్తారంగా, నిరంతరాయంగా వర్షాలు లేకపోవడంతో నదుల్లో భారీ వరద ప్రవాహాలు కనిపించడం లేదు. ఖరీఫ్ సీజన్‌కు జూలై నెల అత్యంత కీలకమైనది. ఈ సమయంలోనే వరి, పత్తి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటల సాగు వేగం అందుకుంటుంది. అయితే.. జూలైలోనూ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోతే ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు పెరగకపోవచ్చు. ఫలితంగా సాగునీటి విడుదల పై ఒత్తిడి పెరిగి, ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యతపై అనిశ్చితి ఏర్పడే అవకాశం ఉంది. అదే సమయంలో తాగునీరు, సాగునీరు, విద్యుత్ ఉత్పత్తి అవసరాల మధ్య ప్రభుత్వం సమతుల్యత పాటించడం మరింత సవాలుగా మారుతుంది. కాగా.. గతేడాది కృష్ణా బేసిన్ పరిధిలోని ప్రాజెక్టులు నిండిపోగా.. గోదావరి బేసిన్ లోని ప్రాజెక్టులు చెరువులు కొంత మేరకు నిండాయి. అయితే.. ఈ ఏడాది మాత్రం ఎల్‌నినో ప్రభావం, వర్షాభావం పరిస్థితుల వల్ల కృష్ణా, గోదావరిలో ఎక్కడ ప్రాజెక్టుల్లో నీరు కనిపించడం లేదు.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# హస్తంగూటిలో అసంతృప్తి సెగ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పార్టీ, ప్రభుత్వ తీరుపై కాంగ్రెస్ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సమస్యలు, రాజకీయ కారణాలు ప్రస్తావిస్తూ బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. దీంతో పార్టీకి కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయనే నెలకొన్నదన్న చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తున్నది. తాజాగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి నూతన ట్రస్ట్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. స్థానిక సీనియర్ నేతగా తనకు కనీస సమాచారం కూడా ఇవ్వకపోవడం సరికాదంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారాన్ని రేపాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోనే తన మునుగోడు నియోజకవర్గం కూడా వస్తుందని, తన జిల్లాకు సంబంధించిన కీలకమైన నిర్ణయంలో కనీసం చెప్పకపోవడం ఏమిటీ? స్థానిక ఎమ్మెల్యేగా తనకు సమాచారం ఇవ్వకపోవడం ఏమిటని ఓ చానల్ తో మాట్లాడుతూ రాజగోపాల్ రెడ్డి తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగానే ఇటీవల సీఎం పాల్గొన్న నల్లగొండ సభకు హాజరుకాలేదని ఆయన సంచలన కామెంట్లు చేశారు. 'పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడిన పాత కాంగ్రెస్ నేతలు రోజురోజుకు కనుమరుగవుతున్నారు. ఎక్కడెక్కడి నుంచో కొత్తవాళ్లు వచ్చారు. ఇప్పుడు పార్టీలో, ప్రభుత్వంలో అంతా వాళ్లదే నడుస్తున్నది' అని రాజగోపాల్ రెడ్డి చేసిన కామెంట్లు పార్టీలో, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. మంత్రివర్గంలో తనకు చోటు కల్పించకపోవడంతోనే ఆయన బహిరంగంగా విమర్శిస్తున్నారని, పార్టీ తగిన చర్యలు తీసుకోవాలని నేతలు అంటున్నారు.

**బీజేపీ ఎమ్మెల్యేలకే ఇంపార్టెన్స్ అని..**

ఇటీవల జరిగిన ఓ సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చేసిన కామెంట్లు కూడా పార్టీలో చర్చకు దారితీశాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, విపక్ష బీజేపీ ఎమ్మెల్యేలకే మంత్రులు, అధికారులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారంటూ చేసిన కామెంట్లు హాట్ టాపిక్‌గా మారాయి. ఇక అప్పుడప్పుడు కొందరు ఎమ్మెల్యేలు కూడా అధికారులు, కొందరు స్థానిక నేతలు, మంత్రులపైన సునిశిత విమర్శలు చేస్తున్నారు. బాన్సువాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి కూడా ఓ సందర్భంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోందని, సంబంధిత మంత్రికి విన్నవించినా స్పందన సరిగా లేదని అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు ఇలా బహిరంగంగా తమ అసంతృప్తిని వెల్లడించడం వల్ల పార్టీలో ఆ సమస్యకు దారితీసిన పరిస్థితులను చక్కదిద్దే కార్యక్రమాన్ని పార్టీ చేపడితే బాగుంటుందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

# తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గురుకులాల్లో అవినీతి, రాష్ట్ర అప్పులపై చర్చించేందుకు హరీష్ రావు గన్ పార్క్ వద్దకు రావాలని మంత్రి అడ్లూరి చేసిన చాలెంజ్ ను ఆయన స్వీకరించారు. తెలంగాణ భవన్ నుంచి గన్ పార్కుకు బయల్దేరగా.. అక్కడే హరీష్ రావు వాహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చర్చకు రమ్మనడం, పోలీసులను అడ్డం పెట్టుకుని పారిపోవడం దేనికంటూ హరీష్ రావు మంత్రులపై ఫైరయ్యారు. చర్చకు రావాలని ముగ్గురు మంత్రులు పిలిస్తే వెళ్తున్నానని, దానికెందుకు తనను ఆపుతున్నారని పోలీసులతో వాదించారు. కావాలంటే మంత్రులకు ఫోన్ చేసి అడగాలని, వారంతా తమకోసం అమరవీరుల స్థూపం వద్ద ఎదురుచూస్తున్నారన్నారు. తప్పు చేయకపోతే ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించారు. తామేం కొట్లాటకు పోవట్లేదని, దయచేసి తమను ఆపొద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజల పక్షాన, దళితుల పక్షాన, ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ప్రజల గొంతుకగా వెళ్తున్నానన్నారు. తమ వద్ద కొండాసురేఖ లెటర్, హైకోర్టు ఆర్డర్లు, డ్రగ్స్ సప్లయర్లకు, బ్రోకర్లకు టెండర్లు ఇచ్చిన ఆధారాలు కూడా ఉన్నాయన్నారు. కాగా.. ఇందుకు అనుమతి లేకపోవడంతో గన్ పార్కుకు వెళ్లేందుకు ఎట్టిపరిస్థితుల్లోనూ వెళ్లనివ్వబోమన్నారు. వాహనాలను వెళ్లనివ్వకపోతే కాలినడకన వెళ్తామన్నారు. కారు దిగి వెళ్తుండగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు , బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగి హరీష్ రావు కిందపడిపోయారు. తమ నేతనే అడ్డుకుంటారా అంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులపై ఫైరయ్యారు. తీవ్ర ఉద్రిక్తత నడుమ హరీష్ రావును, బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అవినీతిని బయటపెట్టేందుకు చర్చకు వెళ్తుంటే.. పోలీసులు తమను అడ్డుకుని అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. చర్చకు పిలిచి, పోలీసులతో అడ్డుకోవడం ఎంతవరకూ కరెక్టని ప్రశ్నించారు. చర్చకు పిలిచిన మంత్రులే.. పోలీసులకు చెప్పి రానివ్వాలని చెప్పాలన్నారు. మీడియా సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతినంతా బయటపెడుతామన్నారు. మరోవైపు అప్పులపై మంత్రి జూపల్లి కృష్ణారావుతో చర్చించేందుకు బయల్దేరిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ లను కూడా తెలంగాణ భవన్ వద్దే అరెస్ట్ చేశారు.





# రాష్ట్రంలో సవాళ్ల రాజకీయం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో అధికార – ప్రతిపక్షాల మధ్య సవాళ్ల రాజకీయం నడుస్తోంది. ప్రస్తుతం ఇది రాష్ట్రంలో హాట్ టాపిక్ గా మారింది. గురుకులాల్లో అవినీతి జరిగిందని ఆరోపించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.. అది అబద్ధమైతే దానిపై చర్చించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులు చర్చకు రావాలని సవాల్ చేశారు. దీంతో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి, అజారుద్దీన్ లు గన్ పార్కుకు బయల్దేరారు. గురుకులాల టెండర్లలో అవినీతి ఆరోపణలు నిజమని నిరూపిస్తే.. తన పదవికి రాజీనామా చేస్తానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ చేశారు. ఇదే అంశంపై ఉదయం 11 గంటలకు అన్ని ఆధారాలతో తాను ప్రెస్ క్లబ్ కు వస్తానని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు అక్కడికే వచ్చి చర్చిస్తారని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు. అలాగే తెలంగాణ ప్రభుత్వ అప్పులపై చర్చించేందుకు రావాలని మంత్రి జూపల్లి కృష్ణారావుకు బీఆర్ఎస్ కు చెందిన మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులు సవాల్ చేశారు. చర్చకు సిద్ధమని, గత ప్రభుత్వం 8 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసిందన్నది వాస్తవమని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. ఇప్పటికే కేటీఆర్, హరీష్ రావులు తెలంగాణ భవన్ కు చేరుకోగా.. జూపల్లి కూడా అక్కడికే బయల్దేరినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన రెండున్నరేళ్లలోనే భారీగా అప్పులు చేసిందని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా.. గడిచిన పదేండ్లలో బీఆర్ఎస్ అత్యధిక అప్పులు చేసిందని కాంగ్రెస్ మంత్రులు ఆరోపిస్తున్నారు. తెలంగాణ విభజన నాటికి ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పులపాలు చేసింది బీఆర్ఎస్సేనని మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే ఇరు పార్టీల నేతలు – మంత్రుల మధ్య సవాళ్లు – ప్రతి సవాళ్లు జరిగాయి. దీంతో రాష్ట్ర రాజకీయం వేడెక్కింది. చర్చల్లో ఏం తేలుస్తారన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అటు తెలంగాణ భవన్, ఇటు ప్రెస్ క్లబ్ వద్ద పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

# నమ్మించి తీసుకెళ్లి బావిలోకి తోసేశాడు..



**తిమ్మాపూర్,ఫ్లాష్ ఇండియా :** పని ఇప్పిస్తానని నమ్మించి ఓ మహిళను తీసుకుని వచ్చి ఆమె ఒంటి పై ఉన్న బంగారం తీసుకొని ఆమెను బావిలో పడేసి పారిపోయిన ఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కరీంనగర్ కిసాన్ నగర్ కు చెందిన గంగాధర లక్ష్మి కూలిగా పని చేస్తుంది. కాగా, బుధవారం ఓ వ్యక్తి పని ఇప్పిస్తానని చెప్పి బుధవారం తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ తీసుకువచ్చాడు. కాగా ఆమెను ఓ వ్యవసాయ బావి వద్దకు తీసుకెళ్లి ఆమె ఒంటి పై ఉన్న బంగారు ఆభరణాలు తీసుకొని ఆమెను బావిలోకి తోసేసి అక్కడి నుంచి పారిపోయాడు. కాగా లక్ష్మికి ఈత రావడంతో రాత్రి బావిలోనే ఉండి ప్రాణాలతో పోరాడింది. కాగా గురువారం ఉదయం ఆ బావి యజమాని వచ్చి చూడగా బావిలో లక్ష్మిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలికి చేరుకొని ఆమెను మంచం, తాళ్ల సాయంతో బయటకు తీసి చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనకు పాల్పడింది ఎవరు..? అనేది తెలియాల్సి ఉంది. నిందితుని గురించి గాలిస్తున్నట్లు ఎస్ఐ సయ్యద్ అన్వర్ తెలిపారు.

# పట్టభద్రుల 'ఎమ్మెల్సీ'పై బీజేపీ గురి




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో కమలనాథులు మరో గ్రాడ్యుయేట్‌స్థానం కైవసం చేసుకునేందుకు వ్యూహాలకు పదును పెడుతున్నారు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం నియోజకవర్గానికి ప్రస్తుత ఎమ్మెల్సీ గడువు మార్చి 2027 వరకు ఉండటంతో ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఆరు నెలల ముందే గెలుపు కోసం పార్టీ పెద్దలు నడుం బిగిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రభుత్వం కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్‌ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తుందనే ప్రచారంతో నగరంలోని కోచింగ్ సెంటర్లు, యూనివర్సిటీల వద్ద ఆందోళలను చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఇటీవల దిల్‌షుక్‌నగర్‌లో పార్టీ అధికార ప్రతినిధి పుల్లారావు యాదవ్‌ఆధ్వర్యంలో కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులతో బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఆందోళన చేపట్టారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఇలాగే ధర్నాలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు పార్టీలో చర్చ జరుగుతుంది. పట్టభద్రుల స్థానానికి విద్యార్థి సంఘాల నేతలను బరిలోకి దింపేందుకు పార్టీ ప్లాన్‌చేస్తున్నట్లు తెలిసింది. పలు విద్యాసంస్థలు కలిగి ఉన్న గొంగిడి మనోహర్‌రెడ్డి, ఓయూ విద్యార్థి నేత, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన పుల్లారావు యాదవ్, పార్టీ ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు పేర్లు పరిశీలన చేస్తున్నట్లు సీనియర్లు చెబుతున్నారు. వీరికి సీటు ఇస్తే సునాయాసంగా గెలవచ్చని హైకమాండ్ భావిస్తోంది.

**ఓట్ల నమోదుకు ఇన్‌చార్జిలు..**

పట్టభద్రుల స్థానంలో గెలవాలంటే ముందు నియోజకవర్గం పరిధిలో డిగ్రీ పూర్తి చేసినవారిని ఓటును ఎన్‌రోల్‌మెంట్ చేయించాలి. సొంతంగా ఎవరికి వారే నమోదుకు ముందుకు రావడం కష్టమని పార్టీ తరఫున ప్రత్యేక బాధ్యులను నియమించేందుకు సీనియర్లు ప్లాన్ చేస్తున్నారు. కొత్తగా సుమారు 50 వేల నుంచి 60 వేల వరకు ఉండవచ్చని భావిస్తూ వారందరి ఓటర్లుగా చేరితే తమకే మద్దతు ఇస్తారని, మూడు జిల్లాల వారీగా ఇన్‌చార్జిలను నియమించి వారితో కొత్తవారిని పూర్తిగా ఎన్‌రోల్‌చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. గతంలో ఎన్నికల్లో నామమాత్రంగా కమలనాథులు పోటీ చేసేవారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల స్థానానికి ఏడాదిన్నర క్రితం జరిగిన ఎన్నికల్లో గెలుపొందడంతో అదే తరహాలో ప్రచారం సరళి చేపట్టి వరంగల్, నల్లగొండ, ఖమ్మం స్థానాన్ని తమ ఖాతాలో వేసేందుకు పార్టీ పెద్దలు యోచిస్తున్నారు. శాసనమండలిలో పార్టీ ప్రాతినిధ్యం పెరిగేలా ప్రయత్నాలు మొదలు పెట్టారు. ప్రస్తుతం ఏవీ రెడ్డి, మల్క కొమురయ్య, అంజిరెడ్డి సభలో ప్రజల గొంతుక వినిపిస్తున్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వ వాగ్దానాలపై ప్రచారం..**

గత ఎన్నికల్లో యువతకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఏ విధంగా మోసం చేసిందో పార్టీ శ్రేణులు నిరుద్యోగులకు వివరించనున్నారు. 2 లక్షల ఉద్యోగాల భర్తీ ఏమైందని, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, కళాశాలల్లో అధ్యాపకుల నియమాకాలను విస్మరించడం వంటి విషయాలు ప్రచారం చేయనున్నారు. ఈ నెలాఖరు నుంచి జిల్లాలోని కోచింగ్ సెంటర్లను గుర్తించి అక్కడ పెద్ద ఎత్తున నిరుద్యోగులతో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేపట్టేందుకు రోడ్ మ్యాప్‌సిద్ధం చేసినట్లు తెలిసింది. ఆందోళన కార్యక్రమాల బాధ్యతలను ఏబీవీపీకి అప్పగించనున్నట్లు పార్టీ పెద్దలు చెబుతున్నారు. అప్పటిలోగా విద్యార్థి సంఘం కమిటీలు పూర్తి చేసి పట్టభద్రుల పోరుకు సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేస్తారని సమాచారం.

# మంత్రి అడ్లూరి చాలెంజ్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అధికార – ప్రతిపక్షాల మధ్య సవాళ్లు – ప్రతిసవాళ్లతో రాష్ట్ర రాజకీయం రసవత్తరంగా మారింది. గురుకులాల్లో అవినీతి, గత ప్రభుత్వ అప్పులు, ప్రస్తుతం ప్రభుత్వం చేసిన అప్పులపై చర్చించేందుకు తాము సిద్ధమని మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్ లు తెలిపారు. తాము గన్ పార్క్ వద్దే ఉంటామని హరీష్ రావు, కేటీఆర్ అక్కడికే రావాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో ఏ మేరకు నిధులు ఖర్చు చేశామో ఆ హిస్టరీ మొత్తం తమ వద్ద ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు. వాళ్ల పాపాలు, తమ అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామంటూ అమరవీరుల స్థూపం వద్ద బైఠాయించారు. ఈ ఆధారాలన్నీ ప్రెస్ క్లబ్ వద్ద అందిస్తానని తెలిపారు. లేదంటే కేసీఆర్ ను ఫాంహౌస్ వదిలి అసెంబ్లీకి రమ్మని చెప్పాలని, అక్కడ చర్చించేందుకు కూడా తాము రెడీ అన్నారు. ఈ సవాళ్లను మొదలు పెట్టిన హరీష్ రావు వెంటనే చర్చకు రావాలన్నారు. గురుకులాల్లో అవినీతి జరిగిందని నిరూపిస్తే.. ఏం చేయడానికైనా రెడీగా ఉన్నామన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ఏ శాఖపై ప్రశ్నించినా సమాధానం చెప్తామన్నారు. తెలంగాణ అమరవీరుల స్ఫూర్తిగా.. ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలపై చర్చించేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

**పారిపోకండి.. మేమే వస్తున్నాం..**

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాలును స్వీకరించిన హరీష్ రావు.. తామే గన్ పార్క్ వద్దకు వెళ్తామన్నారు. అవినీతి అప్పులపై చర్చించేందుకు ప్రెస్ క్లబ్ రమ్మని సవాల్ చేస్తే.. అమరవీరుల స్థూపం వద్దకు రమ్మన్నారని, తమకు ఎలాంటి భేషజాలు లేవన్నారు. తామే గన్ పార్క్ వద్దకు బయల్దేరుతున్నామని, ఈలోగా మంత్రులు అక్కడి నుంచి పరారవ్వొద్దని, ఈ మధ్యలో తమను అరెస్ట్ చేయించే కుట్రలు చేయవద్దన్నారు. గన్ పార్క్ వద్దే సాయంత్రం వరకూ చర్చిద్దామన్నారు.

**బీఆర్ఎస్ నేతలెవరూ చర్చకు రాలేదు : మంత్రి అడ్లూరి**

గురుకులాల్లో అవినీతిపై చర్చించేందుకు బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, కేటీఆర్ లను గన్ పార్క్ వద్దకు రావాలని కోరామని మండ్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ ముగ్గురు మంత్రులం, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలంతా ఎదురుచూశామని, చర్చకు ఎవరూ రాలేదని పేర్కొన్నారు. చాలా సమయంపాటు ఎదురుచూశామని, ఎవ్వరూ రాకపోవడంతో అక్కడి నుంచి CLP ఆఫీసుకు వెళ్లిపోయామని తెలిపారు. దమ్ము, ధైర్యం ఉంటే మాజీ ముఖ్యమంత్రిని ఫాంహౌస్ నుంచి బయటికి వచ్చి మాట్లాడాలని డిమాండ్ చేశారు. మరోవైపు తెలంగాణ భవన్ లో రాష్ట్ర అప్పులపై చర్చించేందుకు వస్తానన్న మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం కేటీఆర్ ఎదురుచూస్తున్నారు. కొద్దిసేపటి క్రితమే తాను కూడా గన్ పార్క్ వద్దకే వెళ్తున్నానని, అక్కడే చర్చించేందుకు వెళ్తున్నానని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. హరీష్ రావు అక్కడికే వెళ్తున్నారని తెలిసి, తాను కూడా అక్కడికే వెళ్తున్నానని, కేటీఆర్ కూడా అక్కడికే రావాలన్నారు. ఇంతలో అనూహ్యంగా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా హరీష్ రావు, ఆర్ఎస్ ప్రవీణ్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సహా బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేసి కంచన్ బాగ్ పీఎస్ కు తరలించారు.

**ఆధారాలతో రండి మేము చర్చకు సిద్ధం.. మంత్రి పొన్నం సవాల్**

గురుకులాల టెండర్లలో అవినీతిపై చర్చించేందుకు తాము సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈరోజు(సోమవారం) గన్‌పార్క్ వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో దేవాలయం లాంటి అసెంబ్లీలో హరీశ్‌రావు చర్చకు రావాలని సవాల్ చేశారు. తాము ప్రెస్‌క్లబ్‌కు కూడా వస్తామని.. కానీ రాజ్యాంగంలో ఎన్నికైన వ్యక్తులు చర్చకు రావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఈరోజు 12 గంటల్లోగా గన్‌పార్క్ దగ్గరకు రావాలని అన్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తే తాము ఎక్కడైనా చర్చకు వస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో లాగా కడప కాంట్రాక్టర్లకు తమ ప్రభుత్వం టెండర్లు ఇవ్వలేదని తేల్చిచెప్పారు. తాము పారదర్శకంగా గురుకులాల టెండర్లు జరగాలని చూశామని పేర్కొన్నారు.

**అవినీతిని నిరూపిస్తే రాజీనామా చేస్తాం..**

'గురుకులాల టెండర్ కోసం ముందుకు వచ్చిన కాంట్రాక్టర్ మాకేమైనా చుట్టమా?. టెండర్లలో అసలు అవినీతి జరిగింది రూ. 2 వేల కోట్లా..? రూ. 5వేల కోట్లా..?. బీఆర్ఎస్ నేతలు ఏది పడితే అది మాట్లాడుతున్నారు. ఆధారాలతో రండి వేము చర్చకు సిద్ధం. మేము అవినీతి చేసినట్లు నిరూపిస్తే.. ముగ్గురు మంత్రులం గన్‌పార్క్ దగ్గర ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తాం. మేము పిరికివాళ్లం కాదు. ఎవరితో పడితే వారితో చర్చకు రాము. మాజీ సీఎం కేసీఆర్ గులాబీ పార్టీ నేతలను అదుపులో పెట్టుకోవాలి. లేదంటే కేసీఆర్‌కు చెడ్డపేరు వస్తుంది. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఏ విషయమైనా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి. ఆయన అవినీతి చేసి ఉండొచ్చు.. ఆర్ఎస్పీకి మేం సమాధానం చెప్పం. తమ జోలికి వచ్చి ప్రవీణ్ ఇబ్బంది పడొద్దు' అని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

# గన్‌మెన్ల తొలగింపు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో రాజకీయ నాయకుల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇంటెలిజెన్స్ ఐజీ నేతృత్వంలోని సెక్యూరిటీ రివ్యూ కమిటీ సిఫార్సుల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 67 మంది ప్రముఖ రాజకీయ నేతలకు భద్రతను పూర్తిగా తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితులు, సదరు నేతలకు ఉన్న ముప్పు తీవ్రతను అంచనా వేసిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

**ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలపై ప్రభావం..**

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ఈ వీఐపీ భద్రత కోత జాబితాలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన కీలక నేతలు ఉన్నారు. అందులో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ కు ఇన్నాళ్లూ కొనసాగిన గన్‌మెన్ల భద్రతను ప్రభుత్వం పూర్తిగా తొలగించింది. అలాగే నల్లగొండ మున్సిపల్ మేయర్ భర్త, బీఆర్ఎస్ నేత కరీం ఖాన్ కు కేటాయించిన గన్‌మెన్లను కూడా వెనక్కి రప్పించారు. వీరితో పాటు బీజేపీకి చెందిన మరో ఇద్దరు ముఖ్య నేతలకు ఉన్న భద్రతను సైతం హోం శాఖ రద్దు చేసింది. ఈ విడతలో భద్రత కోల్పోయిన వారిలో మెజార్టీ నేతలు మాజీ ప్రజాప్రతినిధులు, గత ప్రభుత్వ హయాంలో గన్‌మెన్లను పొందిన వారేనని సమాచారం. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సదరు నాయకులకు కేటాయించిన గన్‌మెన్లు అందరూ తక్షణమే హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ పరిణామం ఇప్పుడు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# 'ఆరోగ్య పాఠశాల'కు మరింత బలోపేతం



**బజార్‌హత్నూర్,ఫ్లాష్ ఇండియా :** విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భద్రత, వ్యక్తిత్వ వికాసమే లక్ష్యంగా జిల్లాలో అమలు చేస్తున్న 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో నిర్వహించిన మూడో విడత ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్యతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, విద్యార్థులు పాటలు, నృత్యాలు, నాటికల ద్వారా ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలోని అంశాలపై అవగాహన కల్పించారు. అధికారులు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, మాదకద్రవ్యాల నివారణ, కాలానుగుణ వ్యాధుల నివారణ, వ్యక్తిత్వ వికాసం వంటి ఆరు ప్రధాన అంశాలపై విద్యార్థులకు వివరించారు. కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ జిల్లాలో గత రెండేళ్లుగా ఆరోగ్య పాఠశాల కార్యక్రమం విజయవంతంగా అమలవుతోందని, దీనికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు, అవార్డులు లభించాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల రక్షణ కోసం పోక్సో చట్టంపై ప్రత్యేక అవగాహన కల్పించేందుకు 'పోక్సో క్యాలెండర్' రూపొందించామని చెప్పారు. విద్యార్థులు తమ సమస్యలను నిర్భయంగా, గోప్యంగా తెలియజేసేందుకు ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి నెల మొదటి తేదీన వాటిని తెరిచి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ మలమూత్ర విసర్జన వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంటూ ప్రతి కుటుంబం ఇంటి వద్ద మరుగుదొడ్డి నిర్మించుకుని వినియోగించాలని సూచించారు. వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులు ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు ఖాన్ అకాడమీ ద్వారా గణితం, సైన్స్‌లో పట్టు సాధించాలని సూచించారు. ఈ ఏడాది జిల్లా నుంచి ట్రిపుల్ ఐటీ బాసరకు రికార్డు స్థాయిలో 67 మంది విద్యార్థులు ఎంపిక కావడం ఆనందదాయకమన్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు మంచి ఆరోగ్యం, నాణ్యమైన విద్య రెండూ అవసరమని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం డిమాండ్ పెరుగుతోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ రూపొందించిన ఆరోగ్య పాఠశాల, విద్యా క్యాలెండర్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. మోడల్ స్కూల్‌లో త్వరలో సీసీ రోడ్డు, బోర్‌వెల్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. కొత్తపల్లి గ్రామానికి సుమారు రూ. కోటి వ్యయంతో వంతెన మంజూరు చేయించినట్లు చెప్పారు. అలాగే జిల్లాలోని కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో స్వచ్ఛమైన తాగునీటి కోసం వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం జిల్లా కలెక్టర్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కలిసి పోక్సో చట్టం-2012 క్యాలెండర్ను ఆవిష్కరించారు. అనంతరం పోషకాహార తోటను ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో రవీందర్, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో మహేందర్ రెడ్డి, ఎంఈవో రాంకిషన్, అకడమిక్ కోఆర్డినేటర్లు లక్ష్మణ్, అజయ్, సర్పంచ్ సాయన్న, ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# టేకులపల్లి నూతన ఎస్సైగా కె.తిరుపతి బాధ్యతల స్వీకరణ..



**టేకులపల్లి,ఫ్లాష్ ఇండియా :** టేకులపల్లి పోలీస్ స్టేషన్‌కు నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా కె. తిరుపతి బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు టేకులపల్లి ఎస్సైగా విధులు నిర్వహించిన రాజేందర్ వి. ఆర్ భద్రాద్రి కొత్తగూడెం కు బదిలీ కావడంతో, ఆయన స్థానంలో తిరుపతి బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై తిరుపతి పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది నూతన ఎస్సై తిరుపతి కి స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఎస్సై ని సన్మానించిన బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ పట్టణంలో నూతన హాస్పిటల్ ప్రారంభ




**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గురువారం రోజున నల్లగొండ పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్ లో నూతనంగా ప్రారంభించిన లావణ్య హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డబ్ల్యూ సి ఇంటీరియర్ వైబ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎండి ఖాజా ఫసియుద్దిన్ పాల్గొని హాస్పిటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు

# విద్యా సంస్థలపై దాడులు చేస్తే క్రిమినల్ కేసులు తప్పవు

**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో కొన్ని విద్యార్థి సంఘాలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని పాఠశాలలు, కళాశాలల్లో అక్రమంగా ప్రవేశించి అలజడి సృష్టిస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలిపారు. వసతుల కొరత, పుస్తకాల విక్రయం వంటి అంశాల పేరుతో యాజమాన్యాలను, సిబ్బందిని బెదిరించడం, విద్యార్థులను భయాందోళనలకు గురిచేయడం, విద్యాసంస్థల పనితీరుకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశపూర్, బర్ధిపూర్ శివారులో ఉన్న నారాయణ విద్యాసంస్థలో అక్రమంగా ప్రవేశించి కుర్చీలు, ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన ఘటనలో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని చందూరు మండలంలోని శ్రీ సాయి విద్యాలయం పాఠశాలలో అనుమతి లేకుండా ప్రవేశించి సిబ్బందిని బెదిరించడం, విద్యార్థులను భయాందోళనలకు గురిచేయడం, వస్తువులు ధ్వంసం చేసిన ఘటనలోనూ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసుల్లో నిందితులకు గతంలోనూ కేసులు ఉంటే అదనపు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. విద్యాసంస్థలకు సంబంధించిన సమస్యలు ఉంటే సంబంధిత జిల్లా అధికారులు, విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని, వారు నిబంధనల ప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని సీపీ తెలిపారు. విద్యార్థి సంఘాల పేరుతో పాఠశాలల్లో ఇబ్బందికర పరిస్థితులు సృష్టించడం, విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగించడం, యాజమాన్యాల నిర్వహణకు భంగం కలిగించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పాఠశాలలు, కళాశాలలను బంద్ చేయించడం చట్టవిరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

# దొరల రూపంలో ఉన్న దొంగలు

**షాద్ నగర్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ పై షాద్ నగర్ ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసి ఇప్పుడు నీతులు చెబుతున్నారని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడారు. ప్రజలు తిరస్కరించినా బీఆర్ఎస్ నాయకులు అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని, అధికారం కోల్పోయిన అక్కసుతో ప్రభుత్వం పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం సుమారు 8 లక్షల కోట్లకు పైగా అప్పులు భారం మోపి, వేల కోట్ల రూపాయల బకాయిలను మిగిల్చిందని అన్నారు. డిస్కమ్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, సివిల్ సప్లై, సీడ్ కార్పొరేషన్, ఆర్టీసీ, సర్పంచ్ల బిల్లులు, కాంట్రాక్టర్ల బకాయిలు, హౌసింగ్ కార్పొరేషన్, బతుకమ్మ చీరలు, మిడ్‌డే మీల్స్ వంటి అనేక రంగాల్లో భారీ బకాయిలు పెట్టి వెళ్లారని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రైతు కుటుంబం నుంచి వచ్చిన ప్రజానాయకుడని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ ఆర్థిక అక్రమాలను అసెంబ్లీ వేదికగా ప్రజల ముందుంచారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం, మద్యం, ఇసుక, ధరణి, గొర్రెల పంపిణీ, భూదోపిడీ వంటి అనేక స్కామ్‌లు జరిగాయని ఆరోపించారు. హైదరాబాద్ చుట్టుపక్కల వేల ఎకరాల భూములను కొందరికి కట్టబెట్టారని, ప్రభుత్వ ఆస్తులను తక్కువ ధరలకు అప్పగించారని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్డును 30 ఏళ్ల లీజుకు ఇచ్చి దొరలమని చెప్పుకునే వారు అసలు దొరలు కాదని, దొరల రూపంలో ఉన్న దొంగలు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజల సంపదను దోచుకున్న వారే ఇప్పుడు నీతి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలకు దూరంగా ఉందని, చట్టం తనపని తాను చేసుకుంటుందని స్పష్టం చేశారు. అవినీతి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జైలుకు వెళ్లాల్సిన సమయం వస్తే ఎవరిని వదిలిపెట్టరని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పారని, రాబోయే ఎన్నికల్లో కూడా అదే తీర్పు పునరావృతమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి, అభివృద్ధి, ప్రజాపాలన కొనసాగుతుండటాన్ని చూసి బీఆర్ఎస్ జీర్ణించుకోలేక అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. చివరగా, తెలంగాణ అభివృద్ధికి ప్రతిపక్షం సహకరించాలని, తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలకు స్వస్తి చెప్పాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో కేశంపేట మాజీ జెడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘునాయక్, బాబర్ అలీ ఖాన్, సుదర్శన్ గౌడ్, పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోనే తొలి సోషల్ ఆడిట్ గ్రామంగా కానుకుంట

**జిన్నారం,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోనే మొట్టమొదటిగా గ్రామైక్య మహిళా సంఘాల సోషల్ ఆడిట్ పూర్తిచేసిన గ్రామంగా గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామం నిలిచిందని రాష్ట్ర స్థాయి సీఆర్డీ ఉషారాణి తెలిపారు. గ్రామంలో రెండు గ్రామైక్య సంఘాల పరిధిలో 34 మహిళా సంఘాలు ఉండగా, అన్ని 34 మహిళా సంఘాల సోషల్ ఆడిట్‌ను విజయవంతంగా పూర్తి చేయడంపై ఆమె అభినందనలు తెలిపారు. సోషల్ ఆడిట్‌ను గత నెల 25వ తేదీ నుంచి ఈ నెల 1వ తేదీ వరకు నిర్వహించినట్లు వెల్లడించారు. సోషల్ ఆడిట్‌లో గుర్తించిన అన్ని అంశాలను మహిళా గ్రామసభను ఏర్పాటు చేసి, సంఘ సభ్యులకు వివరించినట్లు తెలిపారు. సోషల్ ఆడిట్‌లో గమనించిన అంశాలను మహిళలకు పూర్తిగా అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్, జూనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ రాజేష్, జిల్లా స్థాయి అధికారి జాన్ కెనడి, డీపీఎం, ఏపీఎం నరేందర్, సీసీలు వరలక్ష్మి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాలో ఒకటికి మించి ఓట్లు కలిగి ఉండటం చట్టరీత్యా నేరం

**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950 లోని నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితాలో ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉండటం, తప్పుడు సమాచారం ఇవ్వడం శిక్షార్హమైన నేరాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ చట్టంలోని సెక్షన్ 17 ప్రకారం ఏ వ్యక్తి కూడా ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో తన పేరును నమోదు చేసుకోవడానికి చట్టపరంగా అర్హుడు కాదని స్పష్టం చేశారు. సెక్షన్ 18 ప్రకారం ఏ వ్యక్తి కూడా ఏ ఒక్క నియోజకవర్గంలోనైనా ఒకసారి కంటే ఎక్కువ ఓటరుగా నమోదు చేసుకోకూడదని కలెక్టర్ సూచించారు. సెక్షన్ 31 ప్రకారం ఓటర్ల జాబితా తయారీ, సవరణ, పేర్ల నమోదు లేదా తొలగింపుల సమయంలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని, లిఖితపూర్వక డిక్లరేషన్‌ను సమర్పిస్తే, అది తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందన్నారు. అటువంటి వారికి ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష, లేదా జరిమానా, లేదా ఈ రెండూ విధించబడతాయని ఆమె తెలిపారు. ఓటర్లందరూ ఈ చట్టపరమైన నిబంధనలను విధిగా పాటించాలని, ఎవరికైనా ఒకటి కంటే ఎక్కువ ఓట్లు లేదా వేర్వేరు ప్రాంతాలలో ఓట్లు ఉన్నట్లయితే, వెంటనే ఫారమ్-7 ద్వారా అదనపు ఓట్లను తొలగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

# ఆరుగురు పేకాటరాయుళ్ళ అరెస్టు ..

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఆరుగురు పేకాటరాయుళ్ల ను అరెస్టు చేసిన సంఘటన మిర్యాలగూడ రూరల్ పరిధిలో జరిగింది. ఈ సందర్భంగా మిర్యాలగూడ రూరల్ ఎస్సై లక్ష్మయ్య మాట్లాడుతూ గురువారం సాయంత్రం అందాజా 4 గంటల సమయంలో మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెంలోని నయారా పెట్రోల్ బంకు వెనకాల గల ఖాళీ స్థలంలో కొంతమంది పేకాట ఆడుతున్నారని సమాచారం పై దాడి చేసి ఏడుగురిని పట్టుబడి చేయగా ఒక వ్యక్తి పారిపోయినాడు,పట్టుబడిన వారి నుండి 2790 నగదు,ఐదు సెల్ ఫోన్లు,ఐదు మోటర్ సైకిల్లు,104 ప్లేయింగ్ కార్డులు మరియు గ్రౌండ్ షీట్ను స్వాధీనపరచుకొని పంచనామ నిర్వహించి కేసు నమోదు చేయనైనది అని అసాంఘిక కార్యకలాపాలకు పాటుబడితే మరియు పేకాట ఆడితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడుతుందని పత్రికా ముఖంగా తెలిపారు.



# తిమ్మాయిపల్లి తండాలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

**అడ్డాకుల,ఫ్లాష్ ఇండియా :** అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లి తండా గ్రామంలో గురువారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండాలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే నిధులతో ఏర్పాటు చేసిన నాలుగు తాగునీటి బోర్లను ప్రారంభించారు. అనంతరం రూ.10 లక్షల వ్యయంతో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు తండావాసులు, మహిళలు మంగళహారతులు, డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తన కుటుంబం తరఫున నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాలేజీల బంద్ విజయవంతం

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలన్నింటినీ విడుదల చేయాలని కోరుతూ బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు మిర్యాలగూడ పట్టణంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లో విద్యా సంస్థల కళాశాల ల బంధు విజయవంతమైనట్లు బీసీ జేఏసీ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాకముందు బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం చేస్తానికే కాంగ్రెస్ పార్టీ ఉందని నమ్మించి ఈరోజు అధికారంలోకి వచ్చాక పేద పిల్లలు చదువుకుంటానికి పైసలు ఇస్తానికి ఆయనకు మనసు రావడంలేదని అన్నారు. కాలేజీ యాజమాన్యాలు పూర్తి ఫీజు కడితేనే విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇస్తామని చెబుతున్నాయని చేతకాని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుకోవడ ఇష్టం లేదన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రబెల్లి దుర్గయ్య రజక,బీసీ మహిళ సంఘం జిల్లా కార్యదర్శి బంటు కవిత,బీసీ యువజన సంఘం పట్టణ నాయకులు ఎస్ పి నాయుడు,బీసీ విద్యార్థి సంఘం పట్టణ కార్యదర్శి నక్క నాగరాజు ముదిరాజ్,యస్సి మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు చిత్రం ఉమా,ఎమ్ఆర్ పి ఎస్ నాయకులు ఉబ్బపల్లి శంకర్,సిరిణేష్,శాంతికుమార్,శ్రీజ,శ్రీవల్లి,గాయత్రీ,సహస్ర,మానస,శ్రీవాణి,సిరి,సాయికుమార్,గౌతమ్,అశోక్ కుమార్, వెన్నెల,పావని,కరుణాశ్రీ తదితరులు పాల్గొన్నారు.



# అభిషేక్ శర్మ తప్పు లేదు..




భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత వికెట్‌కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ నిరాశపరిచాడు. మ్యాచ్‌కు ముందు అంతర్జాతీయ టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్–1 స్థానాన్ని అందుకున్న ఇషాన్.. తొలి టీ20లో మాత్రం ఖాతా కూడా తెరవలేకపోయాడు. కేవలం రెండు బంతులు ఎదుర్కొన్న అతడు రనౌట్ రూపంలో డకౌట్‌గా వెనుదిరిగాడు. ఈ రనౌట్‌కు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇన్నింగ్స్ ఆరంభంలోనే సంజు శాంసన్ పెవిలియన్ చేరాడు. మూడో స్థానములో ఇషాన్ కిషన్ క్రీజులోకి వచ్చాడు. సాకిబ్ మహమూద్ వేసిన రెండో ఓవర్ చివరి బంతిని లెగ్ సైడ్ షాట్ ఆడి.. పరుగు తీసేందుకు ప్రయత్నించాడు. పరుగు అవకాశం లేదని భావించిన అభిషేక్ శర్మ.. వెంటనే నిరాకరించాడు. అప్పటికే పిచ్ మధ్యలోకి వచ్చిన ఇషాన్.. వెనక్కి వెళ్లే ప్రయత్నం చేశాడు. కానీ అప్పటికే వికెట్ కీపర్ జోష్ బట్లర్ రనౌట్ చేశాడు. దాంతో అభిషేక్ కోపంగా 'క్యా కర్ రహా హై?' (ఏం చేస్తున్నావ్?) అని అరిచాడు. ఆ మాటలు స్టంప్ మైక్‌లో రికార్డు అయ్యాయి. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఈ రనౌట్‌పై తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. కామెంట్రీ సందర్భంగా మాట్లాడుతూ.. 'ఈ ఫార్మాట్‌లో బ్యాటర్లు వీలైనంత త్వరగా ఖాతా తెరవాలని అనుకోవడం సహజం. కానీ ఈ రనౌట్‌లో అభిషేక్ శర్మ తప్పు ఏమాత్రం లేదు. పూర్తి బాధ్యత ఇషాన్ కిషన్‌దే. పరుగు కోసం తొందరపడ్డాడు' అని స్పష్టం చేశాడు. అభిమానులు కూడా ఈ రనౌట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. 'ఇషాన్ కిషన్.. కాస్త చూసుకోవాలి కదా', 'ఇషాన్ బ్రో.. తొందర పడ్డావ్' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 47 బంతుల్లో 68 పరుగులు చేశాడు. అభిషేక్ శర్మ 24 బంతుల్లోనే 59 పరుగులు చేసి ఇంగ్లండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇన్నింగ్స్ చివర్లో శివమ్ దూబే 21 బంతుల్లో 42 పరుగులతో అజేయంగా నిలిచి భారత్‌కు భారీ స్కోరు అందించాడు. అయితే ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ప్రారంభమయ్యే సమయానికి భారీ వర్షం కురవడంతో మ్యాచ్‌ను కొనసాగించడం సాధ్యపడలేదు. అంపైర్లు చాలా సేపు వేచి చూసినా వర్షం తగ్గకపోవడంతో చివరకు మ్యాచ్‌ను రద్దు చేశారు.

# సీఎస్‌కేలోకి హార్దిక్ పాండ్యా..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 సీజన్‌కు ముందు భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పేరు హాట్ టాపిక్‌గా మారింది. ట్రేడ్ విండోలో అతడి పేరు మార్మోగిపోతోంది. ముంబై ఇండియన్స్ తరఫున నిరాశాజనకమైన సీజన్ అనంతరం హార్దిక్ జట్టును వీడే అవకాశాలు ఉన్నాయంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో అతడిని సొంతం చేసుకునేందుకు ఏడు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతున్నాయని వార్తలు వచ్చాయి. అందులో ఐదుసార్లు ఛాంపియన్ అయిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) కూడా ఉందన్న ప్రచారం మరింత ఊపందుకుంది. అయితే ఈ వార్తలపై సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ ఫుల్ క్లారిటీ ఇచ్చారు. హార్దిక్ పాండ్యాను ట్రేడ్ ద్వారా జట్టులోకి తీసుకురావడంపై ఇప్పటివరకు ఎలాంటి చర్చలు జరగలేదని స్పష్టం చేశారు. 'హార్దిక్ పాండ్యా ట్రేడ్ విషయంపై ఇప్పటివరకు మా ఫ్రాంచైజీలో ఎలాంటి చర్చ జరగలేదు. సీజన్ సమీక్ష పూర్తయిన తర్వాతే ట్రేడ్‌లపై నిర్ణయాలు తీసుకుంటాం. మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) ముగిసిన తర్వాత మాత్రమే ఆ ప్రక్రియ ప్రారంభమవుతుంది' అని హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కాశీ విశ్వనాథన్ వెల్లడించారు. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) టోర్నీ జూలై 18 వరకు కొనసాగనుంది. ఈ లీగ్‌లో సీఎస్‌కే అనుబంధ జట్టైన టెక్సాస్ సూపర్ కింగ్స్ కూడా పాల్గొంటోంది. అందుకే ఎంఎల్‌సీ ముగిసిన తర్వాతే ఐపీఎల్ 2027 సీజన్‌పై పూర్తి సమీక్ష నిర్వహించి, ట్రేడ్‌లపై నిర్ణయం తీసుకోనున్నట్లు సీఎస్‌కే యాజమాన్యం సంకేతాలు ఇచ్చింది. ఇదిలా ఉండగా.. టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం.. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) మినహా మిగిలిన అన్ని ఫ్రాంచైజీలు హార్దిక్ పాండ్యాపై ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా చెన్నై, కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) అతడిని దక్కించుకునే రేసులో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఐపీఎల్ 2026లో సీఎస్‌కే ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడం కూడా ఈ ఊహాగానాలకు బలం చేకూర్చింది. 2025లో చివరి స్థానంలో నిలిచిన చెన్నై.. 2026లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. వరుసగా మూడు సీజన్లుగా ప్లేఆఫ్స్‌కు చేరుకోలేకపోవడం, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ పేలవ ఫామ్‌లో ఉండటంతో అతని నాయకత్వంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జట్టుకు సీనియర్ కెప్టెన్ అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత జట్టుకు కూడా నాయకత్వం వహించిన అనుభవం ఉన్న హార్దిక్ పాండ్యా సీఎస్‌కేకు సరైన కెప్టెన్ ఎంపిక కావచ్చని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. గత ఏడాది కూడా సీఎస్‌కే భారీ ట్రేడ్‌లో భాగమైంది. రాజస్థాన్ రాయల్స్ నుంచి సంజు శాంసన్ చెన్నైకి రాగా.. రవీంద్ర జడేజా రాజస్థాన్ జట్టులోకి వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో ఈసారి కూడా సీఎస్‌కే మరో సంచలన ట్రేడ్‌కు సిద్ధమవుతుందా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ప్రస్తుతం మాత్రం హార్దిక్ పాండ్యాపై వస్తున్న వార్తలకు సీఎస్‌కే యాజమాన్యం అధికారికంగా బ్రేక్ వేసింది. అయితే సీజన్ సమీక్ష అనంతరం పరిస్థితులు ఎలా మారతాయో, హార్దిక్ భవిష్యత్తుపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాల్సి ఉంది.

# భారీ వర్షం..తొలి టీ20 మ్యాచ్ రద్దు



భారత్, ఇంగ్లాండ్ మధ్య జరగాల్సిన తొలి టీ20 వర్షార్పణమైంది. చెస్టర్-లె-స్ట్రీట్ వేదికగా ఈ రెండు జట్ల మధ్య బుధవారం తొలి టీ20 జరిగింది. రాత్రి 10 గంటలకు ప్రారంభమైన ఈ మ్యాచ్ నేపథ్యంలో భారత్ మొదటి బ్యాటింగ్ చేసింది. ఫస్ట్ బ్యాటింగ్ ప్రారంభమైన నుంచి వర్షం పడుతూనే ఉంది. ఇక ఇన్నింగ్స్ ముగిసే సమయానికి, వర్షం భారీగా పడింది. అయినా వరుణుడు ఎంతకీ శాంతించకపోవడంతో, మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు అంపైర్లు నిర్ణయం ప్రకటించేశారు. దీంతో క్రికెట్ అభిమానులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. కాగా ఈ మ్యాచ్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఇండియా 7 వికెట్ల నష్టానికి 189 పరుగులు సాధించింది. అభిషేక్ శర్మ 59, శ్రేయస్ అయ్యర్ 68 పరుగులు చేయగా.. సిక్సర్ల దూబే 42 పరుగులతో రాణించాడు. ఇక ఛేజింగ్‌లో ఇంగ్లాండ్ ఒక్క బంతి ఫేస్ చేయకుండానే మ్యాచ్ రద్దయింది.. కాగా జూలై 4 న రెండో టీ20 జరగనుంది.



# అభిషేక్ శర్మ సరికొత్త రికార్డ్..ఒంటి చేత్తో 100 సిక్సులు

ఇంగ్లాండ్, భారత్ మధ్య కాసేపటి క్రితమే టీ20 సిరీస్ ప్రారంభమైంది. ఇందులో భాగంగానే జరుగుతున్న తొలి టీ20 మ్యాచ్ లో ఇంగ్లాండ్ పై ఆధిపత్యం చెలాయిస్తోంది భారత్. మొదటి టీ20 లో ఫస్ట్ బ్యాటింగ్ కు దిగిన భారత్, భారీ స్కోర్ దిశగా దూసుకు వెళ్తోంది. ఈ మ్యాచ్ లో ఓపెనర్ అభిషేక్ శర్మ అర్ధ సెంచరీతో దుమ్ము లేపాడు. 20 బంతుల్లోనే మూడు సిక్సర్లు, ఐదు బౌండరీలతో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. ఈ నేపథ్యంలోనే అరుదైన రికార్డు క్రియేట్ చేశాడు అభిషేక్ శర్మ. టీ20లలో 20 లేదా అంత కంటే తక్కువ బంతుల్లో ఐదు అర్ధ సెంచరీలు చేసిన ఏకైక క్రికెటర్ గా నిలిచాడు. అదే సమయంలో అంతర్జాతీయ టీ20లలో 100 సిక్సర్లు కూడా పూర్తి చేసుకున్నాడు. దీంతో మళ్లీ అభిషేక్ శర్మ పేరు సోషల్ మీడియాలో మారుమోగుతోంది. కాగా ఈ మ్యాచ్ లో 59 పరుగుల వద్ద వికెట్ సమర్పించుకున్నాడు అభిషేక్ శర్మ. 14 ఓవర్లు ఆడిన భారత్ ఇప్పటికే 120కి పైగా పరుగులు సాధించింది.


# బిజినెస్



## భారీగా పెరిగిన బంగారం, వెండి

పెళ్లిళ్లు, శుభకార్యాల వేళ వరుసగా తగ్గుతూ ఊరటనిస్తున్న బంగారం ధర.. గురువారం ఊహించని షాకిచ్చింది. అనూహ్యంగా ధర పెరగడంతో కొనుగోలుదారులు అయోమయంలో పడ్డారు. ఉదయం 10 గంటలకు హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై ఏకంగా రూ.3770 పెరిగి.. రూ.1,44,550కి చేరింది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై రూ.3450 పెరిగి.. రూ.1,32,500కి జంప్ అయింది. బంగారంతో పాటు వెండి ధర కూడా షాకిచ్చింది. కిలో వెండిపై రూ.5000 పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,50,000వద్ద కొనసాగుతోంది. పెరిగిన ధరలకు జీఎస్టీ, మేకింగ్ ఛార్జీలు అదనంగా ఉంటాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రాంతాన్ని బట్టి ధరల్లో మార్పులు ఉండవచ్చు. వరుసగా ధరలు తగ్గుతుండటంతో.. బంగారం ధర మరింత దిగి వస్తుందని ఎదురుచూస్తున్న వారికి ఇది నిజంగానే ఊహించని షాకని చెప్పాలి. ప్రస్తుతం పెళ్లిళ్లకు ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో బంగారం కొనుగోళ్లకు డిమాండ్ ఏర్పడింది. అలాగే ధర తగ్గడంతో ఇన్వెస్టర్లు బంగారంపై పెట్టుబడులకు ఆసక్తి చూపడం కూడా ధర పెరగడానికి కారణమైనట్లు నిపుణులు చెప్తున్నారు.

## ఐటీ ఉద్యోగులకు మళ్లీ బ్యాడ్ న్యూస్..




ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న ఐటీ నిపుణులకు టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కోలుకోలేని షాక్ ఇవ్వబోతోంది. సంస్థలో మరోసారి భారీ ఎత్తున ఉద్యోగ కోతలు విధించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ కొత్త లేఆఫ్స్ పరంపరలో భాగంగా కంపెనీ తన గ్లోబల్ వర్క్‌ఫోర్స్ నుంచి సుమారు 2.5 శాతం మంది సిబ్బందిని తొలగించనుందట. దీనివల్ల ఒకేసారి 5,000 మందికి పైగా ఉద్యోగుల జీవనోపాధి దెబ్బతినే ప్రమాదం ఉందని సమాచారం.

**ఏఐ రేసు..**

మైక్రోసాఫ్ట్ ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , జెనరేటివ్ ఏఐ టెక్నాలజీ మౌలిక సదుపాయాలలో వేల కోట్ల పెట్టుబడులు పెడుతోంది. ఈ కొత్త సాంకేతికత సంస్థ యొక్క పాత సాఫ్ట్‌వేర్ వ్యాపారాన్ని దెబ్బతీస్తుందేమోనని ఇన్వెస్టర్లు భయపడుతున్నారు. దీంతో ఏఐ వైపు వేగంగా అడుగులు వేస్తున్న మైక్రోసాఫ్ట్.. ఆ ఖర్చులను భర్తీ చేయడం కోసం సాధారణ వ్యయాలను తగ్గించుకుంటోంది. ఇందులో భాగంగానే సేల్స్, కన్సల్టింగ్, గేమింగ్ విభాగాల్లోని ఉద్యోగులపై వేటు వేయనున్నారు. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్‌లో దాదాపు 2,20,000 మంది ఉద్యోగులు ఉన్నారు.

**వాలంటరీ రిటైర్మెంట్ స్కీమ్**

యూఎస్ ఉద్యోగుల కోసం ఇప్పటికే సంస్థ ఒక ప్రత్యేక స్వచ్ఛంద పదవీ విరమణ కార్యక్రమాన్ని కూడా తెచ్చింది. వయస్సు, మొత్తం సర్వీసు అనుభవం కలిపి 70 సంవత్సరాలు దాటిన వారికి ఈ సదుపాయం వర్తించనుంది. గత నెల రోజుల్లో మైక్రోసాఫ్ట్ స్టాక్ ఏకంగా 17 శాతం మేర పతనమైంది. ఈ తీవ్ర ఆర్థిక ఒత్తిడి కారణంగానే కంపెనీ ఖర్చులను అదుపు చేయడానికి ఉద్యోగులను రోడ్డున పడేసే కఠిన నిర్ణయానికి మొగ్గు చూపుతోందని అంటున్నారు. ఇప్పటికే గూగుల్, అమెజాన్, మెటా, ఒరాకిల్ వంటి సంస్థలు వేలాది మందిని తొలగించగా.. ఇప్పుడు ఆ జాబితాలోకి మైక్రోసాఫ్ట్ కూడా చేరడం ఐటీ రంగాన్ని వణికిస్తోంది. అయితే ఈ లేఆఫ్స్ వార్తలపై మైక్రోసాఫ్ట్ యాజమాన్యం ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయాల్సి ఉంది. హార్డ్‌వేర్ తయారీ ఖర్చులు భారీగా పెరగడంతో, ఎక్స్‌బాక్స్ ఉత్పత్తుల ధరలను ఏకంగా $150 (సుమారు రూ.12,500) వరకు పెంచాల్సి వచ్చింది. దీంతో మార్కెట్‌లో నిలదొక్కుకోవడానికి గేమింగ్ బృందంలో పెద్ద ఎత్తున పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నారు. నిజానికి మైక్రోసాఫ్ట్ ఉద్యోగులకు ఈ పింక్ స్లిప్స్ భయాలు కొత్తేమీ కాదు. గత ఏడాది మే నెలలో 6,000 మందిని, ఆ తర్వాత జూలైలో మరో 9,000 మందిని.. ఇలా మొత్తంగా 15,000 మందిని (4% సిబ్బందిని) ఇప్పటి వరకు సంస్థ తొలగించింది. ఇప్పుడు మళ్లీ కొత్తగా 5,000 మంది ఉద్యోగాలకు లేఆఫ్‌లు ఇవ్వనున్నట్లు కనిపిస్తుండటంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

## 500 పాయింట్లు ఎగబాకిన సెన్సెక్స్..




అమెరికా–ఇరాన్ మధ్య దోహా వేదికగా జరుగుతున్న చర్చలు సానుకూల ఫలితాలను ఇవ్వనున్నాయనే అంచనాల నేపథ్యంలో దేశీయ సూచీలు వరుసగా రెండో రోజు కూడా లాభాల బాట పట్టాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర ఒక శాతం తగ్గి 70.80 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. గత రెండ్రోజులుగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్న ఐటీ షేర్లపై మదుపర్లు ఆసక్తిని కనబరుస్తున్నారు.

ప్రస్తుతం డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ (94.96) బలపడింది. ఇన్ని సానుకూలాంశాల నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (76,922)తో పోల్చుకుంటే గురువారం ఉదయం స్వల్ప లాబాలతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత పైకి వెళ్లింది. ఉదయం 9:40 గంటల సమయంలో సెన్సెక్స్ 492 పాయింట్ల లాభంతో 77,415 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 143 పాయింట్ల లాభంతో 24,149 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో కోఫోర్జ్, ఎక్సైడ్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, ఇన్ఫో ఎడ్జ్, ఎంఫసిస్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి.

వెర్సోవా టీడీ, అవెన్యూ సూపర్ మార్కెట్, హిటాచీ ఎనర్జీ, భెల్, సీజీ పవర్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 322 పాయింట్ల లాభంతో ఉంది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 169 పాయింట్ల లాభంతో ఉంది.

## తెలుగు రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు



నిత్యావసర వస్తువుల్లో ఒకటైన గ్యాస్ సిలిండర్ ధరలు అంతర్జాతీయ ముడి చమురు ధరలపై ఆధారపడి ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరల పై కీలక నిర్ణయం తీసుకుంది. హోటళ్లు, రెస్టారెంట్లు, టీ స్టాల్స్ తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించింది. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ. 183 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. తగ్గిన ఈ ధరలు జులై 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.3,191గా ఉంది. ఇదిలా ఉంటే.. గత నెల(జూన్)తో పోలిస్తే గృహ వినియోగ ఎల్‌పిజి ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**జులై 2వ తేదీ నాటి గ్యాస్ సిలిండర్ ధరలు**

హైదరాబాద్: రూ.994.00
వరంగల్: రూ.1013.00
విశాఖపట్నం: రూ.950.00
విజయవాడ: రూ.966.50
గుంటూరు: రూ.966.50




## వెండితెరకు హీరోగా డైరెక్టర్ ఎంట్రీ..

'ఖైదీ', 'విక్రమ్', 'కూలీ', 'లియో' లాంటి చిత్రాలతో దర్శకుడిగా మెప్పించిన లోకేశ్ కనగరాజ్.. ఇప్పుడు హీరోగా ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. అరుణ్ మాతేశ్వరన్ దర్శకత్వంలో 'డిసి' అనే టైటిల్‌తో తెరకెక్కుతోన్నఈ చిత్రాన్ని గతేడాదే అధికారికంగా ప్రకటించినప్పటికీ.. ఇప్పటి వరకు ఈ సినిమా నుంచి ఎలాంటి అప్డేట్స్ రాలేదు. ఈ క్రమంలోనే తాజాగా అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'వెండితెరపై సందడి చేయడానికి దేవదాస్ అండ్ చంద్ర సిద్ధంగా ఉన్నారు..! జులై 31న ప్రపంచవ్యాప్తంగా డిసి విడుదల కానుంది' అంటూ పోస్టర్‌ను షేర్ చేశారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ వామికా గబ్బి హీరోయిన్‌గా నటిస్తుండగా.. అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు. డైరెక్టర్‌గా స్క్రీన్ ప్రజెంట్స్‌తో తనను తాను నిరూపించుకున్న డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్.. ఇప్పుడు హీరోగా బిగ్ స్క్రీన్‌పై ఎలాంటి మ్యాజిక్ చేస్తాడో అని వెయిట్ చేస్తున్నారు నెటిజన్లు.



## ఆ స్టార్ డైరెక్టర్‌తోనేనా?

టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ కెరీర్‌లో మరో భారీ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ప్రస్తుతం సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతుంది. ఇప్పటి వరకు స్టార్ హీరోల సరసన గ్లామరస్ పాత్రల్లో నటించి మెప్పించిన కాజల్, ఇటీవల 'సత్యభామ' వంటి సినిమాలతో లేడీ ఓరియెంటెడ్ పంథాలోకి అడుగుపెట్టింది. తాజాగా ఆమె నటిస్తున్న కొత్త చిత్రం గురించిన ఇప్పుడు ఒక క్రేజీ అప్‌డేట్ ఇండస్ట్రీ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారమవుతోంది. కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రలో ఒక ప్యాన్ ఇండియా లేడీ ఓరియెంటెడ్ సినిమా పట్టాలెక్కడానికి రెడీ అవుతుందట. అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్ రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుందని సమాచారం. ఒకవేళ ఈ వార్తలు నిజం అయితే టాలీవుడ్‌లో ఒక స్టార్ హీరోయిన్ నటించే ప్యాన్ ఇండియా లేడీ ఓరియెంటెడ్ చిత్రం రెండు భాగాలుగా రావడం ఇదే మొదటిసారి కానుంది.కంప్లీట్‌గా మహిళా ప్రాధాన్యత కలిగిన పాత్రలో కాజల్ కనిపించబోతోందని, ఈ కథలో ఆమె క్యారెక్టరైజేషన్ ఎంతో విలక్షణంగా, మునుపెన్నడూ చూడని విధంగా ఉంటుందని సమాచారం. ఇప్పటికే కథా చర్చలు ముగిశాయని, కాజల్ ఈ ప్రాజెక్ట్‌కు పూర్తిస్థాయిలో లాక్ అయిందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తెలుగుతో పాటు దేశవ్యాప్తంగా వివిధ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. త్వరలోనే ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన, అలాగే దర్శకుడు, నిర్మాతలకు సంబంధించిన పూర్తి వివరాలు వెలువడనున్నాయని సమాచారం. ఈ విభిన్నమైన ప్రాజెక్ట్‌తో చందమామ కాజల్ అగర్వాల్ కెరీర్ సరికొత్త మలుపు తిరగనుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రెండు రాష్ట్రాల్లో రిలీజ్




వైవిధ్యమైన కథలతో పాటు వినూత్నమైన కంటెంట్‌ను ఎల్లప్పుడూ ప్రోత్సహించే టాలెంటెడ్ యాక్టర్, ప్రొడ్యూసర్ రానా దగ్గుబాటికి చెందిన ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ 'స్పిరిట్ మీడియా' మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతోంది. 'అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పి' బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మాణంలో, రమణా రెడ్డి సోమ దర్శకత్వంలో తెరకెక్కిన అవుట్ అండ్ అవుట్ కమర్షియల్ కామెడీ ఎంటర్‌టైనర్ 'అమీర్ లోగ్'. ఈ సినిమా థియేట్రికల్ హక్కులను 'స్పిరిట్ మీడియా' దక్కించుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని అత్యంత భారీ ఎత్తున విడుదల చేసేందుకు సర్వం సిద్ధం చేస్తోంది. హైదరాబాద్ గల్లీ బ్యాక్‌డ్రాప్‌లో ముగ్గురు స్నేహితుల మధ్య సాగే ప్రయాణం, వారి లైఫ్ స్టోరీ, నేటి యువతకు కనెక్ట్ అయ్యే ఒక మంచి సందేశంతో ఈ సినిమాను రూపొందించారు. ఈ చిత్ర కథాంశం, మేకింగ్ 'స్పిరిట్ మీడియా' బృందానికి విపరీతంగా నచ్చడంతో.. ఈ యూత్‌ఫుల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను తామే స్వయంగా రిలీజ్ చేయడానికి ముందుకొచ్చారు. రానా బ్యానర్ సపోర్ట్ లభించడంతో సినిమాపై ట్రేడ్ వర్గాల్లో అప్పుడే అంచనాలు పెరిగాయి.'అమీర్ లోగ్' చిత్రం నుంచి ఇప్పటివరకు విడుదలైన ప్రతి ఒక్క అప్‌డేట్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో మంచి టాక్ సొంతం చేసుకుంది. సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ మొదలుకొని, రీసెంట్‌గా రాకింగ్ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ ఆలపించిన 'అవ్వల్ దావత్' సాంగ్, మరియు ఎనర్జిటిక్ టీజర్ యూత్‌లో విపరీతమైన క్రేజ్ తీసుకొచ్చాయి. ఈ చిత్రంలో ఎంసీ హరి, మనోజ్, శశిధర్ హీరోలుగా నటించగా.. వేదశ్రీ, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయియోగి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ స్మరణ్ సాయి ఈ చిత్రానికి సంగీతాన్ని అందించగా.. ఎస్‌వీకే ఫోటోగ్రఫీ, రోహిత్ పెనుమత్స ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను మరియు గ్రాండ్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించనున్నారు.




## ఆసక్తిని రేకెత్తిస్తోన్న 'రావు బహదూర్'

"నాటకానికి లాజిక్ ఉండదు అంటారు.. కానీ నాటకానికి మాయ తోడైతే లాజిక్కే మారిపోతుంది" అంటూ మహేష్ బాబు చెప్పే గంభీరమైన డైలాగ్స్‌తో ప్రారంభమైన ఈ ట్రైలర్ ప్రేక్షకులలో విపరీతమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇందులో చివరి స్టేజ్ లివర్ క్యాన్సర్‌తో మరణానికి దగ్గరై, ఆ తర్వాత ఒక అద్భుతం వల్ల బతికిన వ్యక్తిగా రామయ్య అలియాస్ రావు బహదూర్ పాత్రలో సత్యదేవ్ అద్భుతమైన నటనను కనబరిచారు. తెలుగు సినిమాలో ఇప్పటివరకు చూడని ఒక మైండ్ బ్లోయింగ్ లాంటి సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఈ చిత్రం అందించబోతున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. డార్క్ కామెడీ, సస్పెన్స్, మ్యాజికల్ రియలిజం వంటి విభిన్నమైన ఎలిమెంట్స్‌తో రాబోతున్న ఈ మూవీ ట్రైలర్‌తో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు పెరిగాయి.




## జననాయగన్ కు సెన్సార్ షాక్

కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'జననాయగన్' రిలీజ్ చుట్టూ ఇండస్ట్రీలో సరికొత్త చర్చ నడుస్తోంది. గత 7 నెలలుగా ఈ చిత్రం సెన్సార్ వివాదాలు, కోర్టు కేసుల కారణంగా వాయిదా పడుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం సెన్సార్ బోర్డు నుండి 'A' (అడల్ట్) సర్టిఫికెట్ పొందే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే వారం రోజుల్లోగా ఈ తుది సర్టిఫికేషన్ ప్రక్రియ పూర్తి కానుందని ఆ వెంటనే హిందీ, తెలుగు వెర్షన్ల సెన్సార్ ఫార్మాలిటీస్‌ను కూడా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోంది.సెన్సార్ సమస్యలు వీడుతుండటంతో మేకర్స్ ఈ సినిమాను జూలై 16 లేదా జూలై 23న థియేటర్లలోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇప్పటికే ఈ విండోలో పలు క్రేజీ చిత్రాలు తమ విడుదల తేదీలను ప్రకటించాయి. జూలై 17న 'అన్వేడయానా', జూలై 23న 'మకుటం', 'ఇమ్మోర్టల్', అలాగే జూలై 31న 'డిసి', 'సిగ్మా' వంటి చిత్రాలు లైన్లో ఉన్నాయి. ఇప్పుడు ఒకవేళ దళపతి విజయ్ రేసులోకి వస్తే ఇప్పటికే ప్రమోషన్లు మొదలుపెట్టిన ఆయా చిత్రాల కలెక్షన్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే సెన్సార్‌ఇూ సర్టిఫికెట్ ఇస్తే చిన్న పిల్లలు ఈ సినిమా చూసేందుకు అనుమతించరు. తమ హీరో సినిమాను కావాలనే ఇబ్బందులు పెడుతున్నారని ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కానీ దళపతి చివరి చిత్రం కావడంతో ఈ సినిమా ఎప్పుడు వచ్చినా థియేటర్ల వద్ద జాతర ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నారు.

## రాయితో కొట్టి తల పగలగొట్టా



"నేను ట్యూషన్‌కు వెళ్లే దారిలో కొందరు యువకులు నన్ను రోజూ ఏడిపించేవారు, వేధించేవారు. మొదటి రోజు సరేలే అని వదిలేశాను. రెండో రోజు కూడా అలాగే భరించాను. కానీ మూడో రోజు మాత్రం నా ఓపిక నశించింది, ఇక అస్సలు తట్టుకోలేకపోయాను" అని కాయాదు లోహర్ పేర్కొంది.ఆ సమయంలో తనకు వచ్చిన కోపం చూసి నన్ను ఏడిపించిన వారు కూడా ఊహించి ఉండరని కాయాదు చెప్పింది. "నాకు విపరీతమైన కోపం వచ్చేసింది. కింద ఉన్న ఒక పెద్ద రాయిని తీసుకుని వాళ్లపైకి బలంగా విసిరాను. అది వెళ్లి నేరుగా ఒకడి తలకు తగలడంతో వాడి తల పగిలిపోయింది. తల నుంచి రక్తం కారడం చూసి నేను వెంటనే అక్కడి నుంచి వచ్చేశాను. ఆ తర్వాత అక్కడ ఏం జరిగిందో కూడా నాకు తెలియదు" అంటూ ఆ నాటి సంఘటనను బయటపెట్టింది. అలా ఒకరి తల పగలగొట్టడం సరైన పద్ధతి కాదని ఇప్పుడు అనిపిస్తున్నా.. ఆ వయసులో తనకు తోచిన పద్ధతిలో బుద్ధి చెప్పానని కాయాదు చెప్పింది. తాను స్వభావరీత్యా చాలా ప్రశాంతంగా ఉంటానని, కానీ తప్పును మాత్రం అస్సలు సహించనని క్లారిటీ ఇచ్చింది. కాయాదు లోహర్ కెరీర్ విషయానికి వస్తే, ప్రస్తుతం ఆమె చేతిలో క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. అథర్వ సరసన 'ఇధయ మురళి', జీవీ ప్రకాష్ కుమార్ సరసన 'ఇమ్మోర్టల్' చిత్రాల్లో నటిస్తోంది. ఇవే కాకుండా దుల్కర్ సల్మాన్ నటిస్తున్న 'ఐ యామ్ గేమ్', పృథ్వీరాజ్ సుకుమారన్ మోస్ట్ అవేటెడ్ మూవీ 'ఖలీఫా', న్యాచురల్ స్టార్ నాని నటిస్తున్న పాన్ ఇండియా ఫిల్మ్ 'ది పారడైజ్' వంటి భారీ చిత్రాల్లో కాయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుంది.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**